# కులం - మతం
# శాస్త్రీయ అవగాహన

## విద్యాబోధన

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రచురణ

ప్రచురణ సంఖ్య : 1356

ప్రథమ ముద్రణ : 1999
ద్వితీయ ముద్రణ : మే, 2015

వెల : ₹ 20/-

ప్రచురణ
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) - తెలంగాణా రాష్ట్ర కమిటీ
హౌస్ నెం. 1-1-60/2, యం.బి.భవన్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్ - తెలంగాణ
*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*
*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

బ్రాంచీలు
హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.
నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక


**కులం - శాస్త్రీయ అవగాహన ........................................ 5**

కుల సమస్య - దాని లక్షణాలు ........................................ 6

భారతదేశ చరిత్ర - కుల వ్యవస్థ పుట్టుక ........................................ 7

నాలుగు వర్ణాలుగా మారడం ........................................ 8

వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థగా మారిన తీరు ........................................ 8

బ్రిటిష్ వాళ్ళ కాలంలో ........................................ 10

1947 తరువాత భారతదేశము ........................................ 11

కుల వ్యతిరేక పోరాటాలు ........................................ 12

కుల సమస్యకు పరిష్కార మార్గాలు ........................................ 13

కుల వివక్షతా వ్యతిరేక పోరాటం - సి.పి.ఐ.(ఎం) అవగాహన ........ 14

1. భావవాద దృక్పథం - మానసిక పరివర్తనా క్రమం ............ 14
2. కులాంతర వివాహాల ద్వారా ........................................ 16
3. కులాన్ని తప్పించలేని మత మార్పిడి మార్గం ........................ 17
4. భౌతికవాద దృక్పథం - భూమి సమస్య ............................ 18
5. అధికారమా - అవకాశవాదమా ........................................ 24
6. అన్ని కులాలలోని పేదల ఐక్యత కావాలి ........................... 25
7. చట్టాలు - సంపన్నుల చుట్టాలు ........................................ 26
8. వివక్షతను సహించకూడదు - వివక్షతను చూపకూడదు ........ 26

## మతం – శాస్త్రీయ అవగాహన ........................................ 31

1. ఆదిమ మానవుడికి మతం ........................................ 31

2. మతం ........................................ 32

3. మత ఉన్మాదం ........................................ 35

4. మతం – భారతదేశ ప్రత్యేకత ........................................ 35

5. లౌకికతత్వం ........................................ 36

6. హిందూ ఛాందసవాదం ........................................ 37

7. మైనారిటీ – మత ఛాందసం ........................................ 38

8. కాంగ్రెస్ మెతకదనం ........................................ 38

9. మత ఛాందసానికి వ్యతిరేకం ........................................ 38

10. ముగింపు ........................................ 39

# కులం - శాస్త్రీయ అవగాహన

**భా**రతదేశంలో ఒక బలమైన కుల వ్యవస్థ వుంది. ప్రపంచంలో ఇటువంటి కుల వ్యవస్థ ఏ దేశంలోనూ లేదు. అక్కడ వర్గ దోపిడి మాత్రమే వుంది. కానీ మన దేశంలో కుల పీడన అదనంగా వుంది. ఈ కాలంలో కులం అనే మాట అందరి నోట వినపడుతున్నది. రాజకీయాలలో కులం అనేది ముఖ్యమైన భాగం అయింది. కులం ఆధారంగా అభ్యర్థులు నిర్ణయించబడుతున్నారు. కుల సంఘాలు పెరిగినాయి. ఆ పేరుతో సమీకరణలు చేస్తున్నారు. అన్ని కుల సంఘాల నోట ఒకటే మాట వస్తున్నది. మనం ఐక్యంగా వుండాలి. మిగతా వాటిని ఎదుర్కోవాలనే మాట మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ, మాల మహానాడు ఎ.బి.సి.డి. వర్గీకరణపై పోరాటాలు చేస్తున్నాయి. తుడుం దెబ్బ, డోలు దెబ్బ, చాకిరేవు దెబ్బ, పూసల కేక లాంటి ఉద్యమాలు వస్తున్నాయి. విద్యార్థులలో, విశ్వవిద్యాలయాలలో, ఉద్యోగులలో, కార్మికులలో ఇంకా అన్ని వర్గాలలో కులాన్ని గురించి చర్చ జరుగుతుంది. దళిత సంఘాలు కొన్ని కుల పోరాటాల ద్వారానే విప్లవం వస్తుందని చెబుతున్నారు. విప్లవం పేరు చెబుతున్న కొన్ని గ్రూపులు కుల పోరాటం, వర్గ పోరాటం ఒకటే అంటున్నారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి.ల నాయకత్వ స్థానంలో వుంటేనే న్యాయం జరుగుతుందని అంటున్నారు. మొత్తం మీద ఈ కాలంలో కుల చైతన్యం పెరుగుతున్న మాట వాస్తవం. ఈ వాదనలు ప్రచారం చేయడానికి కొన్ని పత్రికలు, సాహిత్యం ముందుకు వచ్చాయి. అందుకే కుల సమస్య గురించి లోతుగా పరిశీలన చేయాలి. ఇది ఎందుకు వుంది? కులం పుట్టుక, కారణాన్ని గురించి తెలుసుకోవాలి. ఈ సమస్యకు శాస్త్రీయ పరిష్కారాన్ని కనుగొనాలి.

## కుల సమస్య - దాని లక్షణాలు

ప్రపంచంలో అన్ని దేశాలలో వర్గాలు వున్నాయి. వర్గ దోపిడి వుంది. కులాలు, కుల వ్యవస్థ లేదు. అన్ని దేశాలలో సాధారణ అంశం వర్గ దోపిడి అయితే మన దేశంలో వర్గ దోపిడీతో పాటు కుల పీడన అదనంగా వుంది. అందుకే మనం ఈ సమస్య గురించి చర్చించాలి.

మండల కమిషన్ గుర్తించిన లెక్కల ప్రకారం మన దేశంలో 5వేల కులాలున్నాయి. ఉప కులాలు 40వేల నుండి 50వేల వరకు వుండవచ్చునని అంచనా వేశారు. ఇన్ని కులాలు వున్నా అన్ని కులాలకు వేరు వేరు సాంప్రదాయాలు, కుల కట్టుబాట్లు వున్నాయి. షెడ్యూలు కులాలు 56 ఉన్నాయి.

### కులం

ఒక వృత్తి చేసేవాళ్ళు, స్వచ్ఛత, మాలిన్యం అనే అంశాలపై ఆధారపడి చేసుకున్నదే కులం.

### కులం లక్షణాలు

(1) కులాలు అంతర్ వివాహ సమూహం. ఒక కులంలో వాళ్ళు ఇంకో కులం వాళ్ళను పెళ్ళిచేసుకోరాదు. చేసుకుంటే వెలివేయడం జరుగుతుంది.

(2) వ్యక్తి ఏ కులంలో పుడితే ఆ కులంలోనే వుండాలి. అంటే కులం పుట్టుకతో నిర్ణయించబడుతుంది.

(3) ఒక కులం ఒక వృత్తికి కట్టుబడి వుంటుంది.

(4) వివిధ కులాలు ఒక క్రమ శ్రేణిలో ఏర్పడి వుంటాయి. వీటిలో ఎక్కువ, తక్కువలు నిర్ణయించేది స్వచ్ఛత, మాలిన్యం ఆధారంగానే. అందరికంటే ఎక్కువ మాలిన్యం కలవాళ్ళు తక్కువ కులంగా చెప్పబడ్డారు.

(5) తిండి విషయం, పెళ్ళి విషయం, నివాసం విషయంలోనూ, ఇతర కులాలతో సంబంధాలలోనూ ప్రతి కులానికి కొన్ని విధి, నిషేధాలు వుంటాయి.

(6) ఒక కులంలోని సమస్యలను కుల పంచాయతీల ద్వారా కుల పెద్ద పరిష్కారం చేస్తుంటాడు.

## భారతదేశ చరిత్ర - కుల వ్యవస్థ పుట్టుక

భగవద్గీతలో కృష్ణుడు "చాతుర్వర్ణం మాయాసృష్టం" అని "గుణకర్మ విభాగశ" అని నాలుగు వర్ణాలను సృష్టించినట్లు చెప్పాడు. పురుష సూక్తంలో బ్రాహ్మణుడు బ్రహ్మదేవుని నుదురు నుండి, క్షత్రియుడు భుజాల నుండి, వైశ్యులు తొడల నుండి, శూద్రులు పాదాల నుండి ఉద్భవించారని చెప్పబడింది. దీనిలో ఐదువేల కులాల గురించి ఏమి చెప్పలేదు. అలాగే ఐదవ వర్ణం "పంచములను" గురించి ఏమీ చెప్పలేదు. బ్రాహ్మణులు ఆలోచన చేస్తారని, క్షత్రియులు పాలన చేస్తారని, వైశ్యులు వ్యవసాయం చేస్తారని, శూద్రులు పై మూడు వర్ణాలకు సేవలు చేస్తారని చెప్పారు. ఈ వాదన వాస్తవం కాదు. ప్రపంచంలో అన్ని దేశాలలో జరిగినట్లే మన దేశంలో కూడా శ్రమ విభజన జరిగింది. మొదట్లో స్త్రీ పురుషుల మధ్య శ్రమ విభజన జరిగింది. స్త్రీ ఇంటికి పరిమితమై, పురుషుడు వ్యవసాయం, వేటలకు నాయకత్వం వహించాడు.

1921లో సింధు నాగరికతను గురించి బయట ప్రపంచానికి తెలిసింది. అప్పటి వరకు భారతదేశ చరిత్రను సరైన కోణం నుంచి అర్ధం చేసుకోలేకపోయాము. ఇప్పటికి సుమారు 5వేల సంవత్సరాల క్రితం భారతదేశంలో అభివృద్ధి చెందిన సింధూ నాగరికత వుండింది. సింధూదేశం అనే పేరు నుండే హిందూ దేశం అనే పేరు వచ్చింది.

పశ్చిమాసియా దేశాలైన ఇరాన్, టర్కీ దేశాల నుండి ఆర్యులు పశువులను మేపుకుంటూ సంచార జాతులుగా మన దేశానికి వచ్చారు. అప్పటికే మన దేశంలో సింధూ నదీ లోయ ప్రాంతంలో జనం వున్నారు. వ్యవసాయం చేసే సింధూ ప్రజలకు, పశు పోషణ కోసం వచ్చిన ఆర్యులకు నీటి ప్రవాహ విషయంలో ఘర్షణ ఏర్పడింది. ఆర్యులకు సింధూ ప్రజలకు పెద్ద యుద్ధాలు జరిగినవి. ఆర్యులు సింధూ పట్టణాలనేకం ధ్వంసం చేసి అక్కడిజనాన్ని దాసులుగా పట్టుకున్నారు. కారణం సంచార జాతులైన ఆర్యులకు యుద్ధంలో నైపుణ్యం వుండటమే. సింధు ప్రజలు స్థిర నివాసులయినందున, వారికి యుద్ధంలో నైపుణ్యం లేనందున ఓడిపోయారు. ఇలాగే ఆర్యగణాల మధ్య కూడా యుద్ధాలు జరిగాయి. ఆర్యులు తెల్లగా వుండేవారు. సింధు ప్రజలు గోధుమ వర్ణంతో వుండేవారు. ఆ రకంగా రెండు వర్ణాలు ఏర్పడ్డాయి. మొదటి విభజన ఆర్యులకు, ఆర్యేతరులకు మధ్య జరిగింది. ఆర్యులు వచ్చే నాటికి ఇక్కడ అనేక తెగలు వుండేవి. వీరి మధ్య ఆర్థిక అసమానతలు కూడా వుండేవి. ఆర్యులు గోత్రీయ తెగలుగా వుండేవారు. ఓడిపోయిన వారిలో కొన్ని తెగలను వాళ్ళలో కలుపుకున్నారు. ఆ విధంగా పెద్ద గణాలుగా,

ఇంకా పెద్ద తెగలుగా ఏర్పడినాయి. ఆర్యులలో కూడా 3 తెగలు ఏర్పడ్డాయి. ప్రతి పురాతన సమాజంలోను పురోహితులు, కమాండర్లు వ్యవసాయం చేసేవాళ్ళుగా 3 తెగలు (భారతదేశంలోనే కాదు) అన్ని దేశాలలో ఏర్పడ్డారు. ఏ ఇతర వర్గాలు లేనిచోట కూడా గిరిజనులలో పురోహితుడు వుంటాడు. కుల పెద్దలు వుంటారు. ఆర్యులు ఇక్కడికి వచ్చే నాటికే 3 తెగలుగా ఏర్పడ్డారు.

## నాలుగు వర్ణాలుగా మారడం

ఇండియా వచ్చిన తరువాత అణచబడిన వారు ఒక వర్గంగా ఏర్పడ్డారు. వీరినే మొదటి దాసులుగా తర్వాత శూద్రులుగా పరిగణించారు. ఆ విధంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలు ఏర్పడినాయి. ఈ పరిణామం భారతదేశంలోనే కాదు. ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ ఇలాగే జరిగింది. క్రైస్తవ మతం గురించి ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ లాంటి దేశాలలో పరిశీలించినా, ఈజిప్టు, మొసపుటోనియా చరిత్రలను పరిశీలించినా ఇది కనపడుతుంది. పోప్, ఫాదర్, పూజారి, ముల్లాలు, మంత్రగాళ్ళు – పురోహితవర్గంగా, చక్రవర్తి, లార్డ్, నైట్, సేనా నాయకులు, ప్రభువులు, నోబుల్స్ – పాలకుల వర్గంగా, బానిసలు, దాసులు, శూద్రులు, పాలితుల వర్గంగా అన్ని సమాజాలలోగానే ఇక్కడ వున్నారు. ఈ నాలుగు వర్ణాల వ్యవస్థ భారతదేశంలో చాలా కాలం కొనసాగింది. మొదట ఒక వర్గం నుండి మరొక వర్గానికి మారే పరిస్థితి వుండింది. చరిత్రలో కొంతమంది శూద్రులు, బానిసలు కూడా పరిపాలన చేశారు. ఉదా : ఒక బానిస రాజ్యం, దక్షిణ భారత పాలకులు.

**పంచములు :** వీరిని గురించి అనేక వాదనలు వున్నాయి. వాది వాదనల సారాంశం (1) లొంగని బౌద్ధులు (2) గోమాంసం భక్షించే ఆదిమ తెగలు (3) చర్మకారులు (4) పారిశుధ్య కార్మికులుగా పనిచేసే బానిసలు (5) వర్ణ సంకరంగా పుట్టిన సంకరజాతి (6) యుద్ధాలలో ఓడిపోయిన పరాజితులు. ఆ విధంగా వీరిని గ్రామం వెలుపల వుంచి అనేక నిర్బంధాలకు గురిచేసిన బానిస వర్గమే ఈ పంచములు.

## వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థగా మారిన తీరు

వ్యవసాయం విస్తరిస్తున్న కొద్దీ, వృత్తులు బాగా పెరిగాయి. వీటిలో కొత్త తెగలు చేరి కొత్త కులాలుగా ఏర్పడ్డాయి. వృత్తిని బట్టి కులం ఏర్పడింది. వీటి సంఖ్య పెరిగింది. ఇప్పటికీ ఈ విధానం జరుగుతూనే వుంది. మొదట్లో ఒక వృత్తి నుండి

వేరొక వృత్తికి మారే అవకాశం వుంది. గుప్తుల కాలం నాటికి భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. ఏ వృత్తిలో వారు ఆ వృత్తికి కట్టుబడి వుండాలనే సిద్ధాంతం అమలులోకి వచ్చింది. వృత్తులు మారనందున కులం కూడా మారటానికి వీలు లేకుండా పోయింది. మధ్యయుగాల్లో వ్యవసాయం ఎవరి చేతుల్లో వుందో వారే పెద్ద కులాలుగా అభివృద్ధి అయ్యారు. ఆ విధంగా పెద్ద కులాల చేతుల్లోకి భూసంపద వచ్చింది. స్వర్ణయుగం అనే గుప్తుల కాలంలోనే ఎక్కువ కులాలు వెలుగులోకి వచ్చాయి. చేతివృత్తులు బాగా అభివృద్ధి చెందాయి. ప్రపంచంలో వర్ణాలు ఏర్పడితే మన దేశంలో కులాల రూపంలో వర్గాలు ఏర్పడ్డాయి. అన్ని దేశాలలో రాజ్యాంగం చేసిన పనే మన దేశంలో మత కట్టుబాట్లు చేశాయి. ఈ కాలంలో అన్ని ధర్మాలు ప్రచారంలోకి వచ్చాయి. కొత్త సాహిత్యం, పురాణాలు, మను ధర్మ శాస్త్రం, భగవద్గీత, యాజ్ఞవల్క్యం ఈ కాలంలోనే వచ్చాయి. వీటన్నింటి సారాంశం నిష్కామ కర్మ సిద్ధాంతం కులాలు దేవుడి సృష్టి అని చెప్పారు. ప్రజలకు ఈ సిద్ధాంతం నూరిపోసేందుకు పురాణాలు, భాగవతం, రామాయణం, మహాభారతం వచ్చాయి. హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మలాటలు, వీధిభాగవతులు వచ్చాయి. ఈ స్థితిలో శారీరక శ్రమ చేసే కుటుంబాలలో మేధావులు పుట్టినా వారిని నిరోధించి కులాన్ని కుల వృత్తిని ఘనీభవింప చేశాయి. శూద్రులు వేదాలు చదవకూడదు. వినకూడదు అన్నారు. ఇతర దేశాలకు మన దేశానికి ఇక్కడే తేడా కనబడుతుంది.

| | ఇతర ప్రపంచ దేశాలలో | మన దేశంలో |
|---|---|---|
| 1. | ఆదిమ సమాజం | గణ వ్యవస్థ |
| 2. | బానిస సమాజం | చాతుర్వర్ణ వ్యవస్థ |
| 3. | భూస్వామ్య సమాజం | కులం రూపంలో భూస్వామ్య సమాజం |

ఇతర దేశాలలో రాజ్యాంగం చేసిన పనే మన దేశంలో ఆచారాలు, కట్టుబాట్లు పేరుతో మతం చేసింది. ఆ విధంగా నాటి కుల వ్యవస్థ ఏర్పడింది. ఎక్కువ సంఖ్యలో వున్న తక్కువ కులాలను, కొద్ది సంఖ్యలో వున్న అగ్ర కులాలు దోపిడీ చేశాయి. కులం పేరుతో శిక్షలు వేసినవి. అగ్ర కులాల వారికి ఒక శిక్ష, శూద్రకులాలకు మరొక శిక్ష, ఒకే తప్పుకు రెండు రకాల న్యాయాలు అమలు జరిగేవి. ఉదా : భగవద్గీత, మనుధర్మశాస్త్రం నుండి ఉదాహరణలు తీసుకోవచ్చు. తక్కువ కులాల వారికి అన్ని రకాల హక్కులు

నిరాకరించారు. ఇవి అన్ని అంగీకరించేటట్లు, శిక్షలు భరించేటట్లు చేసినారు. భూస్వామ్య అభివృద్ధికి, రక్షణకు కులాలను మారకుండా చేశారు. అన్ని దేశాలలో వర్గ దోపిడి జరిగితే మన దేశంలో కులం, మతం పేరుతో అదే దోపిడి జరిగింది. ప్రాథమికంగా వర్గం కులంగా మారింది. వర్ణ వ్యవస్థ ఏమి చేసిందో కుల వ్యవస్థ అదే చేసింది. ప్రపంచంలో రాజ్యాంగ యంత్రం దౌర్జన్యం ద్వారా ప్రజలను అణచివేస్తే మన దేశంలో ప్రధానంగా మానసికంగా దోపిడీని అంగీకరింపచేశారు.

## బ్రిటిష్ వాళ్ళ కాలంలో

బ్రిటిష్ వాళ్ళు వచ్చేనాటికి భారతదేశం స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వుంది. పక్క గ్రామాలతో, పట్టణాలతో సంబంధం లేకుండా విడివిడిగా వున్నాయి. 1757 ప్లాసీ యుద్ధం ద్వారా ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారం చేపట్టింది. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటం జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. వ్యాపారం కొరకు వచ్చిన వారు వాళ్ళ లాభాల కొరకు అనేక చట్టాలు చేశారు. ఏకీకృత రాజ్యాంగ వ్యవస్థను ప్రవేశపెట్టారు. విద్యా విధానంలో ప్రవేశపెట్టిన మార్పులు కుల వ్యవస్థలో మార్పుకు దోహదపడింది. అమ్మకం, కొనుగోలుకు అనుకూలమైన మార్పులు చేశారు. చేతివృత్తులు, దెబ్బతిని వృత్తి ప్రాతిపదికన వున్న కుల వ్యవస్థలో మార్పులు జరిగాయి. భూమి వికేంద్రీకరణ చేశారు. కొంతమందిని భూమి లేనివాళ్ళను చేశారు. బ్రిటిష్ వాళ్ళు వర్గ సమాజానికి బీజాలు వేశారు. స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బద్దలు కొట్టారు (అంతకుముందు ఎవరూ చేయలేని పని). నూతన వర్గాలు రావడంతో మాలిన్యం అనే భావ పునాది కరగడం ప్రారంభమైంది. వివిధ కులాలు కలిసి ప్రయాణం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

జాతీయోద్యమంలో మన నాయకులు కుల వ్యతిరేక పోరాటాలు చేయలేదు. అదే కాలంలో సంఘ సంస్కరణల కొరకు పనిచేసిన నాయకులు జాతీయోద్యమంతో సంబంధం లేనివారు. ఉదా : రాజారామమోహన్‌రాయ్, వీరేశలింగం, పైగా కుల వ్యవస్థ గౌరవం పొందింది. తెల్లవాడు కులాల జోలికి పోలేదు. గాంధీజీ తాను సనాతన హిందువునని చెప్పినా హరిజనుల గురించి, అంటరాని వారి గురించి కొంత కృషి చేశారు.

## 1947 తరువాత భారతదేశము

1. భారతదేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఏర్పడటం.
2. విద్యా, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో రిజర్వేషన్స్ కల్పించడం.
3. ప్రభుత్వ రంగ పరిశ్రమలు నెలకొల్పటం.
4. వ్యవసాయం రంగంలో మార్పులు చేయడం (ప్రాజెక్టులు, యంత్రాలు, నూతన వంగడాలు, భూసంస్కరణల చట్టం).
5. స్త్రీలకు ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్స్ కల్పించడం.
6. సాంస్కృతిక రంగంలో మార్పులు.

- చట్టాలు అందరికీ సమానం అని చెప్పినవి. తప్పుని బట్టి శిక్ష అని చెబుతున్నది.
- గతంలో కులాన్ని బట్టి శిక్షలు వేసే పద్ధతి మారింది.
- కొన్ని రిజర్వేషన్స్ కల్పించారు. ఉద్యోగాలు కల్పించారు. (గతంలో చదువుకోరాదు).
- రాజకీయ రిజర్వేషన్స్ కల్పించారు (అంతకుముందు రాజులు అగ్రకులాలు మాత్రమే పాలించారు).
- అన్ని కులాలు, అన్ని వృత్తులు చేస్తున్నారు (గతంలో ఒక కులం వాళ్ళు మాత్రం చేయాలి).
- ఫ్యాక్టరీల్లో అన్ని కులాలు కలిసి జీవిస్తున్నారు.
- ముందుగా పారిశ్రామిక వాడల్లో కులం పోతున్నది.
- అన్ని కులాల్లో ధనిక వర్గం ఏర్పడింది.
- అన్ని కులాల్లో దోపిడీ చేసే వాళ్ళు తయారయినారు (కొన్ని కులాలలో కొద్దిమంది అయినా).
- అన్ని కులాలలో పేదలు తయారయినారు.
- భారతదేశంలో వర్గ విభజన జరుగుతుంది.
- వర్గం వుంది. కులం వుంది. వర్గ దోపిడీ జరుగుతుంది. కుల దోపిడీ కూడా జరుగుతుంది.
- ఒక కులం పాలించడం లేదు. కాని, అన్ని కులాలలోని అందరూ అందరిని పాలిస్తున్నారు.
- పెట్టుబడిదారులు, భూస్వాములు, అన్ని కులాలలోని పేదలను దోపిడీ చేస్తున్నారు.

## కుల వ్యతిరేక పోరాటాలు

### 1. లోకాయుతులు, చార్వాకులు :

(ఆది భౌతికవాదులు) చరిత్రలో మొట్టమొదట కులాన్ని వ్యతిరేకించారు. వీరిని గురించి తిడుతూ 8 కథలు వున్నాయి. చెరువు - చేను నీళ్ళు - పిండ ప్రదానం - యజ్ఞ పశువు.

### 2. జైన - బౌద్ధ మత ఉద్యమాలు :

ఈ మతాలు కులాలను వ్యతిరేకించాయి. బౌద్ధమతం చరిత్రలో ఒక ముఖ్యమైన పాత్ర వహించింది. జంతువులను చంపితే వ్యవసాయాభివృద్ధికి ఆటంకం. ఆనాటికి వ్యవసాయం కనిపెట్టి, అభివృద్ధికి కావలసిన స్థితిలో వుంది. అందుకే జంతు బలులకు వ్యతిరేకంగా అహింసా సిద్ధాంతం ప్రచారం చేసింది. బౌద్ధమతం కష్టాలకు కోర్కెలే కారణం అని చెప్పింది. అన్ని కులాల వారిని శిష్యులుగా చేర్చుకొని బౌద్ధారామాలు నెలకొల్పారు. అయితే బౌద్ధ భిక్షువులకే ఈ పద్ధతి అమలు జరిపారు. ఆ మేరకైనా అది అభ్యుదయకరమైందే.

### 3. భక్తి ఉద్యమాలు :

కబీర్, నానక్ ఇంకా కొందరు భక్తి ఉద్యమాలు నడిపారు. మత సామరస్యం కొరకు పనిచేశారు. శివ, వైష్ణవ భక్తి ఉద్యమాలు - బ్రహ్మనాయుడి దేవుడు చెన్న కేశవుడు, చాప కూటి సిద్ధాంతం - వీర శైవం - శివుడు - పేదవారి దేవుడు - భక్త కన్నప్ప.

### 4. బ్రాహ్మణ వ్యతిరేక పోరాటాలు :

జ్యోతి బాపూలే, అంబేద్కర్, పెరియార్, రామ్ మనోహర్ లోహియా, కాన్షీరామ్, త్రిపురనేని రామస్వామి చౌదరి, కత్తి పద్మారావు లాంటి వారు బ్రాహ్మణ్య వ్యతిరేక పోరాటాలు నడిపారు. జ్యోతిబాపూలే సత్యశోదక్ సమాజ్ స్థాపించి, అందరికీ విద్య, స్త్రీ విద్య కోసం ప్రయత్నాలు చేశారు.

## అంబేద్కర్

1. జీవితాంతం కుల నిర్మూలనా పోరాటం చేశాడు.
2. రాజ్యాంగంలో రిజర్వేషన్స్ కొరకు ప్రయత్నం చేశాడు.
3. స్త్రీలకు ప్రత్యేక హక్కుల కొరకు పోరాటం.
4. కులాంతర వివాహాలకు ప్రోత్సాహం.
5. దళితునిగా పుట్టి రాజ్యాంగ రచన చేయడం.
6. న్యాయశాఖ మంత్రిగా పనిచేశాడు.
7. అనేక పుస్తకాలు రచించాడు.

– అంబేద్కర్ ఆశయాలను ఈనాటి పరిస్థితులకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్ళటమే. ఇప్పుడు చేయాల్సిన పని.

## కుల సమస్యకు పరిష్కార మార్గాలు

1. పాలక వర్గాలు చెప్పే మార్గం
2. దళితులు ఇతరులు చెప్పే మార్గం
3. సిపిఎం చెప్పే మార్గం

## పాలక వర్గాల మార్గం

**సంక్షేమ పథకాలు – భూ సంస్కరణలు భూదానోద్యమం ఇతర విషయాలు చెబుతున్నవి. దళిత సంఘాలు నక్జలైటు గ్రూపులు చెబుతున్నది :**

1. భారతదేశంలో వర్గం లేదు. కులం మాత్రమే వున్నది.
2. కుల చైతన్యం వుంది. వర్గ చైతన్యం లేదు.
3. దళితులు బహుజనులు అధికారంలోకి రావాలి.
4. హిందూ మతం పోవాలి.
5. కులాంతర వివాహాలు జరగాలి.
6. కమ్యూనిస్టులు అగ్రకులాల పార్టీలు.
7. రిజర్వేషన్స్ ద్వారా పరిష్కారమవుతుంది.
8. మార్క్సిజం, బౌద్ధం, అంబేద్కరిజం ఒక్కటే అని చెప్పడం.

9. ఎం.ఆర్.పి.ఎస్., మాల మహానాడు కొత్త వాదనలు ఎ.బి.సి.డి.లుగా వర్గీకరణ.
10. కులం పేర్లు మార్చుకోవడం ద్వారా ఉదా : విశ్వబ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులు, అగ్ని కుల క్షత్రియులు.

### దళిత సంఘాలు నక్సలైట్లు చేసే వాదనలు వాస్తవం కాదు

1. కులం పుట్టినప్పటి లాగా ఈ రోజు లేదు. వర్గ రూపం ఏర్పడింది.
2. వర్గ చైతన్యం పెరుగుతుంది. దేశంలో కార్మిక వర్గం అనేక పోరాటాలు నడుపుతుంది.
3. దళితులు అధికారంలోకి వచ్చినంత మాత్రానే. పెద్ద మార్పులు జరగవని చరిత్ర చెబుతుంది.
4. మతం చారిత్రకంగా ఏర్పడింది. మతం పోతే కులం పోదు.
5. ఆర్థికంగా అభివృద్ధి అయితే కులాంతర వివాహాలు జరుగుతాయి. వాటి వల్లనే పూర్తిగా మార్పు రాదు.
6. వర్గ దృక్పథంతో పని చేయడం ముఖ్యం. కులం కాదు.
7. రిజర్వేషన్ అవసరమే కాని, అవి మాత్రమే పరిష్కారం కాదు.
8. వర్గ పోరాటం ద్వారానే సమాజం మారుతుంది.

### కుల వివక్షతా వ్యతిరేక పోరాటం - సి.పి.ఐ.(ఎం) అవగాహన

కుల వ్యవస్థను పునాది ఎక్కడ వుంది? ఇది పోవాలంటే మార్గం ఏంటి? అనేక అంశాలకు సంబంధించి అనేక వాదనలు వున్నాయి. ఈ వాదనలు ఒకటి భావ వాదానికి అనుగుణంగా మరొకటి భౌతికవాద సిద్ధాంత ప్రాతిపదికగా వున్నాయి.

### 1. భావవాద దృక్పథం - మానసిక పరివర్తనా క్రమం

భావవాద సిద్ధాంతానికి అనుగుణంగా చెప్పే వాదన కులం పునాది ప్రజల యొక్క మనస్సులో వుంది. ఆలోచనలో వుంది. భావజాలంలో వుంది. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే సనాతన హిందూ ధర్మశాస్త్రంలో వుంది. హైందవ మతంలో వుంది. మను ధర్మశాస్త్రంలో వుంది. బ్రాహ్మణుల యొక్క కులతత్వంలోనూ వుందని భావిస్తారు. అంటే బ్రాహ్మణులంతా కలిసి లేక విడివిడిగా వారొక సిద్ధాంతాన్ని సృష్టించి, ఆ సిద్ధాంతాన్ని మతంగా చేసి, వాటిని ధర్మ సూత్రాల్లోను దేవుళ్ళ రూపంలోను ప్రచారం చేసి, ప్రజల

మనస్సులోకి చొప్పించి నమ్మించి ఈ కుల వ్యవస్థను స్థాపించి కొనసాగిస్తున్నారనేది దీని సారాంశం.

ఈ కుల భావాలకు, సనాతన ధర్మసూత్రాలకు, మతానికి, మనుధర్మశాస్త్రానికి, బ్రాహ్మణ పద్ధతులకు ఈ అన్నింటికీ వ్యతిరేకంగా ఒక సైద్ధాంతిక పోరాటం చేయాలని వీరు చెబుతారు. ఖండన మండనలు, దూషణ భూషణలు ద్వారా వీటన్నింటిని వ్యతిరేకించాలి. విస్తృత ప్రచారం ద్వారా ప్రజానీకానికి తెలియజేయాలి. ఇప్పుడున్న సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్ళి ప్రచారం చేయాలి. వీటి ద్వారా కుల వ్యవస్థను కుల భావాన్ని ఓడించవచ్చు. ఏ ధర్మ శాస్త్రంలో ఏమి చెప్పబడింది. ఏ పురాణంలో ఏమి చెప్పబడింది. ఏ దేవతకు ఏ దేవుడికి ఎవరు పుట్టారు. ఏ దేవతది ఏ కులం. ఏ దేవుడిది ఏం కులం. పక్షికి దేవుడుకి పుడ్తే వాడేమౌతాడు. గాలికి దేవుడికి పుడ్తే వాడేమౌతాడు అంటే మొత్తం ఈ ధర్మశాస్త్రాలు పురాణాలు మత గ్రంథాల్లో వుండే వైరుధ్యాలను, కథలను విడదీసి, చీల్చి చెండాడి మనకు యీ మతం, ధర్మశాస్త్రాలన్నీ వంచనకే అని వీరు చెప్తారు. ఆ వాదనలలో తప్పేమీ లేదు. పోతే మొరటుతనం వుండవచ్చు. కాని సారాంశమేమంటే వాది వాదనలను, తప్పొప్పులను, వైరుధ్యాలను వెల్లడి చేసి, తుత్తునియలు చేసి అందరిముందు బట్టబయలు చేయడం ద్వారా యీ కులభావాలను నిర్మూలించవచ్చని, దెబ్బతీయవచ్చని వారు భావిస్తారు. దానిమీదనే కేంద్రీకరిస్తారు. దానిమీదనే ఎక్కువ కార్యక్రమాలు తీసుకుంటారు. కాని దీనివల్ల పూర్తి ప్రయోజనం జరగదు. ఈ కుల ఛాందసత్వానికి, పురాణాలకు, ధర్మ శాస్త్రాలకు వ్యతిరేకంగా చాలాకాలం నుండి ఈ పోరాటం జరుగుతూనే వుంది. ఒక రకంగా దానిని వ్యతిరేకించి, సైద్ధాంతిక పోరాటం జరిపిన వారు క్రమేణా ఒక ప్రత్యేక కులంగా మారిపోయి కుల వ్యవస్థలో జీర్ణించుకుపోయినవారు వున్నారు.

భక్తి ఉద్యమం దగ్గర నుండి చూస్తే కబీరులాంటివారు. అధునాతన కాలంలో పెరియారు రామస్వామి, డా॥ అంబేద్కర్ మొదలగు గొప్ప వ్యక్తులు ఈ రకంగా ఉద్యమాలు నడిపారు. ఆ ఉద్యమాల్లో ప్రధానంగా వుండేది భావజాల పోరాటం అది ఆచరణలో ఫలితాలను సాధించలేకపోయింది.

ఈ ఆలోచనను మానసిక పరివర్తన సిద్ధాంతంగా పేర్కొనవచ్చు. తమ వాదనల ద్వారా కుల వివక్షతను పాటిస్తున్న అగ్ర కులాల వారి ఆలోచనలను మార్చి కుల వ్యవస్థ దుర్మార్గాన్ని వారికి అవగాహన చేసి కుల వివక్షతను రూపుమాపాలని ఈ ఆలోచన సారాంశం. అగ్రకులాల మంచితనం మీద, దయాదాక్షిణ్యాల మీద, హృదయ పరివర్తనా శక్తి మీద ఆశ పెట్టుకున్న సిద్ధాంతం ఇది.

కుల వివక్షతను వదులుకోవడం అంటే శతాబ్దాల తరబడి అనుభవిస్తున్న సౌకర్యాలను, ఔన్నత్యాన్ని, దోపిడీని, అధికారాన్ని వదులుకోవడానికి అగ్ర కుల పెత్తందార్లు సిద్ధం కావడమే. ఏ దోపిడీ వర్గమైనా స్వచ్ఛందంగా తన దోపిడీని వదులుకుంటుందా? వదులుకోదు. అటువంటి పరిస్థితుల్లో హృదయ పరివర్తన కోసం ఎదురుచూడటం అంటే కుల వ్యవస్థ వున్న భూస్వామిక సంబంధాల నుండి, భూకేంద్రీకరణ నుండి దృష్టి మరల్చడమే. ఆ రకంగా కుల వ్యవస్థను యధాతథంగా కొనసాగడానికి అవకాశం ఇవ్వడమే.

## 2. కులాంతర వివాహాల ద్వారా

మరో వాదన ఏమంటే, ఈ కుల వ్యవస్థకు పునాది కులంలోనే వివాహాలు చేసుకోవడంలో వున్నది అని. ఒక కులం వారు ఇంకొక కులంలో పెళ్ళి చేసుకోకూడదు. అదే కులంలోనే చేసుకోవాలి. కులాంతర వివాహాలను సమాజం ద్వేషిస్తుంది. తీవ్రంగా పరిగణిస్తుంది. ఆ పెళ్ళి కాకుండా చేయడానికి ప్రయత్నం చేస్తారు. అవసరమైతే రక్తం పంచుకొని పుట్టిన వారినైనా నాశనం చేయడానికి సిద్ధమవుతారు. వీటన్నింటిని మనం నిత్యం చూస్తున్నాము.

ఆ కులం వాళ్ళు ఆ కులంలోనే పెళ్ళి చేసుకోవడం వల్ల కుల వ్యవస్థ బద్దలు కాకుండా వున్నది. కులాంతర వివాహాలు విస్తృతంగా జరిగితే ఈ కుల వ్యవస్థ బ్రద్దలైపోయి వ్యవస్థ నాశనమవుతుందని కొంతమంది భావిస్తున్నారు. కుల వ్యవస్థ పోవటానికి కులాంతర వివాహమే ఏకైక మార్గం అని వీరనుకుంటారు. నిజానికి కులాంతర వివాహాలను మనం కూడా ప్రోత్సహిస్తున్నాం. అనేకమంది ప్రోత్సహించారు చరిత్రలో. కాని కుల వ్యవస్థ పోలేదు. కొనసాగుతూనే వుంది. కులాంతర వివాహాలు చేసుకున్న వారు కూడా ఈ రోజు ఏదో ఒక కులంలో కలిసిపోవలసి వస్తూ వుంది. ఒక అగ్ర కుల పురుషుడు ఒక క్రింది కులం స్త్రీని చేసుకుంటే క్రమేణా ఆ స్త్రీ లేక ఆ పుట్టిన పిల్లలు అగ్రకులంలోకి క్రమేణా చేర్చుకోబడుతున్నారు. ఒక క్రింది కులం పురుషుడు ఒక అగ్ర కులం స్త్రీని పెళ్ళి చేసుకుంటే వారి సంతానం క్రమేణా క్రింది కులంలో భాగమై పోతున్నారు. కుల వ్యవస్థలో మార్పు రావడం లేదు. దీనికి కారణం పితృస్వామ్య వ్యవస్థలో వుంది. అంతా పురుషులతో పాటు ప్రపంచం తిరగడం, స్త్రీకి విలువ లేకపోవడం, స్త్రీ కులం కాకుండా పురుషుడు ఏ కులంలో వున్నాడు అనే దాన్ని బట్టి కులం నిర్ణయించి కుల చట్రంలోనే ఇమిడ్చి వేయబడుతున్నారు. ఇక్కడ కులం, పితృస్వామికం మిళితమై కుల

వ్యవస్థ బ్రద్దలు కాకుండా చేస్తోంది. ఒక కులంలో ఆ కులం వారినే వివాహం చేసుకోవడం మనకు కనిపిస్తోంది. కాని లోతుగా చూస్తే ఒక కులంలోనే ఒక గోత్రం వాళ్ళు అదే గోత్రంలో చేసుకోవడానికి వీలు లేదు. ఒకే కులంలో ఉప కులాల మధ్య వివాహాలు జరగవు. అంటరాని కులాలుగా పేర్కొంటున్న కులాల మధ్య కూడా వివాహాలు జరగడం లేదు. ఒకే కులంలో ధనవంతులు, పేదవారి మధ్య వివాహాలు జరగడం కష్టం. అందుకని వివాహానికి సంబంధించిన విధి నిషేధాలు కులంతో పుట్టినవి కావు. అనేక ఇతర అంశాల ప్రభావం కూడా వున్నది. కులంతో సంబంధం లేకుండా విధి నిషేధాలు రద్దు చేస్తే కుల వ్యవస్థ రద్దు అవుతుందనే సిద్ధాంతం తప్పు. ఆచరణ దీన్ని విదితం చేస్తున్నది.

కులాంతర వివాహాల ద్వారా కుల వ్యవస్థ నాశనం అవుతుందన్న సిద్ధాంతం కూడా అగ్ర కులాల మంచితనం మీద, విశాల హృదయాల మీద ఆధారపడి వున్నది. అగ్రకులాల వారు ముందుకు వచ్చి తమ పిల్లలకు క్రింది కులాల వారి పిల్లలతో వివాహాలు జరపాలన్న ఆకాంక్ష మీద ఈ సిద్ధాంతం ఆధారపడి వున్నది. కొంతమంది వ్యక్తులుగా ముందుకు వచ్చే వారిని మినహాయిస్తే, మొత్తం అగ్ర కులాలు ఈ రకంగా ముందుకు వస్తారని ఆశించడం అవివేకం. లేదా బలవంతంగా అంతర్వివాహాలు జరిపించడం అసాధ్యం.

అందువలన కులాంతర వివాహాల ద్వారా మాత్రమే కుల వ్యవస్థ నాశనమవుతుందనుకోవడమంటే ఇంకో రకంగా మానసిక పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించి కుల వ్యవస్థ నిజమైన పునాదిని మరుగుపర్చడమే.

భూస్వామిక వ్యవస్థ బద్దలై, ఆర్థిక అసమానతలు తగ్గి కొత్త సామాజిక సంబంధాలు విస్తృతమయ్యే కొద్దీ కులాంతర వివాహాలు కూడా సర్వసాధారణమవుతాయి.

## 3. కులాన్ని తప్పించలేని మత మార్పిడి మార్గం

ఇది కాకుండా సనాతన హిందూ ధర్మమనేది కులానికి పునాదిగా వుంది కాబట్టి హిందూ మతాన్నే మార్చేస్తే, అంటే హిందూ మతాన్నుండే తప్పుకుంటే మనం కుల వ్యవస్థను అధిగమించవచ్చని కొంతమంది భావించారు. అన్ని రకాల ప్రయత్నాలు చేసిన అంబేద్కర్ ఈ నిర్ణయానికి వచ్చారు. కులమనేది సనాతన హిందూ ధర్మానికి పునాదిగా వుంది కాబట్టి యీ హిందూ మతాన్నే విడిచి బౌద్ధంలో కలిసిపోదాం. దానివల్ల కుల వ్యవస్థను అధిగమించవచ్చునని అనుకున్నారు. కాని ఈ రోజు దళిత బౌద్ధులు రిజర్వేషన్ కోసం ఆందోళన చేయవలసిన పరిస్థితి వచ్చింది. అంటే బౌద్ధ వ్యవస్థలో

దళితులు అసమానంగా వున్నారని తెలుస్తుంది. బౌద్ధమతం కూడా కుల వ్యవస్థను ఎలా కాపాడిందో ఇర్ఫాన్ హబీబ్ రాసిన వ్యాసంలో చక్కగా వివరించారు. దళితుల నుండి వచ్చిన వారు ఈ దుర్మార్గం నుండి అధిగమించేందుకు గాను ముస్లిం మతంలోకి మారిపోయారు. భారతదేశంలో ఇస్లాం మతంలో కూడా కులాలు వున్నాయని అర్థమవుతుంది. క్రైస్తవ మతంలో సమానంగా వారు చూడబడుతున్నారంటే అదీ లేదు. దళిత క్రిస్టియన్లు, రెడ్డి క్రిస్టియన్లు, కమ్మ క్రిస్టియన్లు ఎక్కడకు పోయినా కనిపిస్తారు. చర్చిలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. అగ్రకులాల చర్చిలోనికి దళిత క్రిస్టియన్లను రానివ్వని పరిస్థితి చూస్తున్నాం. మతం మారినా గాని ఈ కుల అంతరాలు పోవడం లేదని అర్థమవుతున్నది. అందువల్ల మతం కన్నా ఇతర పునాది ఏదో వుందనిపిస్తోంది. వాటిని పరిశీలన చేసుకుంటూ పోతే పునాది ఈ భావజాలంలో లేదు. ఈ భావజాలానికి భిన్నమైన దానిలో వుండాలి అనే నిర్ణయానికి రావలసి వుంది.

## 4. భౌతికవాద దృక్పథం - భూమి సమస్య

పునాది ఈ ఆర్థిక వ్యవస్థలో వున్నది. అది భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ. తరతరాల నుండి వచ్చే ఈ ఫ్యూడల్ వ్యవస్థ కులానికి పునాది. ఆ పునాదికి భూకేంద్రీకరణ కీలకం. ఈ భూమి మీద వున్న హక్కు అగ్ర కుల పెత్తనానికి, కుల వ్యవస్థ కొనసాగడానికి పునాదిగా వుంది అని భౌతికవాదం చెప్తుంది. అంటే, భౌతిక వ్యవస్థలో వుండే ఆర్థిక పునాది. దాన్ని బద్దలు కొట్టందే కుల వ్యవస్థను పూర్తిగా రూపుమాపడం సాధ్యం కాదని భౌతికవాదం చెప్తుంది. అయితే, ఈ సిద్ధాంతాన్ని అంగీకరిస్తున్నట్టే అంగీకరించి దీన్ని పరోక్షంగా తిరిగి భావవాదంలోకి మళ్ళించేవారు ఈ మధ్య బయలుదేరారు. నిజమే, కుల వ్యవస్థకు పునాది ఆర్థిక వ్యవస్థలోనే వుంది. మరి ఆర్థిక వ్యవస్థతో సరిపోదు. ఆర్థిక ప్రాతిపదికను మనం వర్గాలని చెప్తాము. వర్గ వ్యవస్థ అని చెప్తాము. భారతదేశ ప్రత్యేక పరిస్థితుల్లో వర్గ వ్యవస్థకు, కుల వ్యవస్థకు తేడా లేదు. కాబట్టి కులమే వర్గం. వర్గం అనే పదం వాడనవసరం లేదు. కులమే వర్గమన్నప్పుడు కుల పోరాటమే వర్గ పోరాటం. అందువల్ల వర్గ పోరాటం, వర్గ వ్యవస్థ అని ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. కుల పోరాటం, కుల వ్యవస్థ అంటేనే సరిపోతుంది అని చెప్తారు. అటు త్రిప్పి, ఇటు త్రిప్పి ఆఖరుకు యీ సిద్ధాంతానికే వస్తారు. ఇట్లాంటి పద్ధతుల్లో కొత్త సిద్ధాంతాలు వస్తున్నాయి. ఇవి కూడా సరైనవి కావు.

ఆచరణలో వర్గానికి, కులానికి ప్రాచీన కాలంలో తేడా లేదు. కాని ఆధునిక కాలంలో వర్గానికి, కులానికి తేడా వచ్చింది. ఒకే కులంలో అన్ని వర్గాలు ఏర్పడ్డాయి.

ఈ రోజు వెనుకబడిన కులాలనే తీసుకోండి. ఉత్తరప్రదేశ్, బీహార్ పోనక్కరలేదు. మన రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో బి.సి. లిస్టులో వున్నవారే పెత్తందారీ కులాలు, ఎందుకంటే వాళ్ళే అక్కడ భూస్వాములు. వారికే భూమి వున్న పరిస్థితి వుంది. ఒకనాడు శూద్రులుగా వున్న కమ్మ, రెడ్లు బ్రిటిష్ హయాంలో రైత్వారీ, జమిందారీ వ్యవసాయక విధానాలు వచ్చిన తర్వాత లాభపడి, శూద్రకులం నుండి అగ్ర కులాల స్థాయికి, అంటే పెత్తందారీ స్థాయికి వచ్చారు. ఈ రోజు ఉత్తరప్రదేశ్, బీహారుల్లో లల్లూప్రసాద్ యాదవ్, ములాయంసింగ్ యాదవ్ ప్రాతినిధ్యం వహించే కులాలు వెనుకబడిన కులాల లిస్టులో వున్నా నీటిపారుదల, వ్యవసాయంలో వచ్చిన మార్పులతో దాదాపు పెత్తందారీ కులాల స్థాయికి వచ్చారు. అంటే ఆ కులాల్లో ఒకప్పుడు ఏకంగా ఒకేరకమైన ఆర్థిక పరిస్థితిలో వున్న పరిస్థితుల నుండి, ఈ రోజు వచ్చిన ఆర్థిక మార్పుల వల్ల కొంతమంది పైకెదిగి, భూస్వాములు, పెట్టుబడిదార్లు, కాంట్రాక్టర్లు, కొందరు మధ్యతరగతిగా పెరిగారు. కొంతమంది క్రిందకి దిగి వ్యవసాయ కార్మికులు, పేద రైలుతుగా అయిపోయారు. అంటే కులంలో వర్గీకరణ జరిగింది. కులంలో వర్గాలు ఏర్పడ్డాయి. ఇది వెనుకబడిన కులాల్లో బాగా స్పష్టంగా కనిపిస్తుంది. దళితుల్లో అంత స్పష్టంగా లేకపోయినా వారిలో రిజర్వేషన్ల మూలంగా ఆర్థికంగా మెరుగుగా బ్రతికే అవకాశం రావడం వల్ల దళితుల్లోనే ఒక మధ్య తరగతి ఏర్పడింది. వర్గీకరణగా దీన్ని మనం యీ కులాల్లో చూడవచ్చు.

ఇంకొకవైపు ఏం జరిగింది? ఒక వర్గంలోకి అన్ని కులాల వారు వచ్చి చేరుతున్నారు. ఒకప్పుడు వ్యవసాయ కార్మిక వర్గమంటే ఎక్కువగా దళితులుండేవారు. కొందరు వెనుకబడిన కులాల వారు వుండేవారు. బ్రిటిష్ వారి కాలం ముందు వెట్టి చేసినా, బానిసలుగా వున్నా మొత్తంగా దళితులే వున్నారు. ఇపుడు చేతివృత్తులు దెబ్బతినడంతో ఆ వృత్తులలోని వారంతా వ్యవసాయ కార్మికుల్లోకి చేరారు. అట్లాగే వెనకబడ్డ అత్యధిక కులాల వారు వ్యవసాయ కార్మికుల్లోకి చేరిపోయారు. అది బ్రిటిష్ కాలం నుండి ప్రారంభమైంది. ఇప్పటికీ కొనసాగుతుంది. ఈ రోజు స్వాతంత్ర్యం వచ్చి, ప్రాజెక్టులు వచ్చిన తర్వాత నీటి పారుదల, పెట్టుబడులు పెరిగి వ్యవసాయం ఖర్చులు ఎక్కువైపోయాయి. పేద రైతులు, మధ్యతరగతి రైతులు దివాళా తీశారు. కొంతమంది పైకెదిగితే, అత్యధికులు దెబ్బతిన్నారు. ఇప్పుడు ప్రత్తి రైతులు, పొగాకు రైతులు, మిర్చి రైతులు, చేపల చెరువులు, రొయ్యల చెరువులు ఇలాంటి వాటితో కొందరు పైకెదిగి అనేకమంది దివాళా తీశారు. అందుకని అగ్రకులాల నుండి కూడా ఈనాడు గణనీయంగా వ్యవసాయ కార్మికుల్లో చేరుతున్నారు. అంటే ఏ వర్గం తీసుకున్నా గాని ఇదివరకు వర్గానికి, కులానికి పెద్ద వ్యత్యాసం వుండేది కాదు. అన్ని కులాల్లో నుండి వచ్చిన వారు

ఆ వర్గంలో వుంటున్నారు. ఏ వర్గంలో చూసినా అన్ని కులాల వారు వుండే పరిస్థితి ఏర్పడింది. దీన్ని బట్టి కులానికి, వర్గానికి వ్యత్యాసమొచ్చిందని అర్థమవుతుంది.

ఒక వర్గంలో ఒకే కులంవారు వుంటే ఒకే కులం పేరుతోనో వర్గం పేరుతోనో ఏకంగా వుండే వారిని ఐక్యం చేస్తూ ముందుకు తీసుకెళ్ళడానికి వీలుండేది. ఇప్పుడు వర్గంలో అన్ని రకాల కులాల వాళ్ళు, దళితులు, వెనుకబడ్డ వారు, అగ్రకులాల వారు వున్నారు. ఈ కుల వ్యవస్థ యొక్క వ్యత్యాసాలు ఒక వర్గంలోనే కొనసాగడం వల్ల వారి మధ్య వుండే ఈ కుల వ్యత్యాసాలు ఆటంకంగా తయారై వర్గ రీత్యా ఐక్యం చేయడం కష్టమై పోతుంది. పేద వారిని వర్గ రీత్యా ఐక్యం గాకుండా, కులరీత్యా విడదీసి వారి ఐక్యతను దెబ్బతీసేందుకు భూస్వాములకు, పెట్టుబడిదారులకు అవకాశం దొరికింది. ఒక వర్గంలో అన్ని కులాల వారు చేరడమనేది వర్గ పోరాటాన్ని సాగించేందుకు అదనమైన కష్టంగా ఎదురైంది.

ఈ మార్పుల వల్ల ప్రతి కులంలోను వర్గాలు ఏర్పడటం జరిగింది. ఒకే రకమైన ఆర్థిక నమూనాలో వారు వుంటే ఒక ఆర్థిక సమస్యను తీసుకొని ఆ కులం వారిని ఐక్యం చేసి మన పోరాటంలోకి తీసుకొని రాగలిగేవారము. ఇపుడు ప్రతి కులంలోను ఉన్నత వర్గాలు, పేదవాళ్ళు అన్న విభజన ఏర్పడింది. ఆ కులంలో వున్న ఉన్నత వర్గాల వారు ఈ కుల భావాన్ని ఆసరాగా చేసుకొని పేదవాళ్ళను మన వైపు సమీకరింపబడకుండా, తమవైపు సమీకరించేటట్లు చేసుకొని ఆ రకంగా మనల్ని దెబ్బతీయడానికి దాన్ని ఉపయోగపరచుకుంటారు. అంటే ఈ రోజు వర్గ ఐక్యతను నిర్మించడానికి మామూలు పరిస్థితులకన్నా ప్రతి వర్గంలోనూ అన్ని కులాలు చేరడం, ప్రతి కులంలోను అన్ని వర్గాలు ఏర్పడటం వల్ల మనకు అదనమైన ఆటంకాలు, ఇబ్బందులు కలిగాయి.

**కులాన్ని - వర్గాన్ని ఒకే గాట కట్టరాదు**

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితి మూలంగానే ఈ "కులం వర్గం ఒకటేనని కుల పోరాటమే వర్గ పోరాటమని" చెప్పే సిద్ధాంతం ఆఖరుకు దోపిడీదార్లకు, అగ్రకుల పెత్తందార్లకు తోడ్పడుతుంది. ఆ కులం వారందరూ ఆ కులంలోని ధనవంతుల వెంట చేరి కుల పోరాటాన్ని నిర్వహించడానికి అంటే పేదలను దళితులను వెనుకబడిన కులాల్లో వుండే పేదలను సమీకరించి భూస్వామ్య శక్తులకు, అగ్రకుల పెత్తందారీ శక్తులకు వ్యతిరేకంగా పోరాడటం కన్నా ఈ పేదవారందరిని ఆ కులాల్లో వున్న సంపన్న వర్గాలు తమ వెనుక సమీకరించుకొని మొత్తం ఈ వ్యవస్థను రక్షించేందుకు తద్వారా సంపన్న

వర్గాలు తమను, తాము రక్షించుకొనేందుకు ఈ సిద్ధాంతం తోడ్పడుతుంది. అందుకనే వర్గ పోరాటం కుల పోరాటం ఒకటనే సిద్ధాంతం నేటి పరిస్థితుల్లో చాలా నష్టకర సిద్ధాంతం. నేడు వున్న పరిస్థితులను కాపాడటానికి, పాలక వర్గాలకు సహాయం చేయడానికి ఇది తోడ్పడుతుంది. ఆచరణలో చూసినా, కాన్షీరామ్ ఏమిటి? మాదిగ దండోరా ఏమిటి? ఈ విధంగా వారంతా పాలక వర్గాలకు తోడ్పడిన విషయాన్ని మనం చూస్తున్నాం.

### ఆర్థిక - సాంఘిక పోరాటాల సమ్మేళనం అవసరం

ఈ సంక్లిష్ట పరిస్థితిలో మనం వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకొని పోవాలనేది మనం అర్థం చేసుకోవాలి. కుల వ్యవస్థకు మూలం భూస్వామ్య విధానంలో వుంది. భూమి కేంద్రీకరణకు, ఆ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడకుండా కుల వ్యవస్థను, కుల సమాజాన్ని నాశనం చేయడం సాధ్యం కాదు. ఇది భౌతికవాదం. అందుకని వర్గ పోరాటం ఆర్థిక పోరాటాలకు మాత్రమే పరిమితమైతే మన వర్గ పోరాటాన్ని రక్షించుకోవడం, సాధించుకోవడం సాధ్యం కాదు. కుల పీడనకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా మనం ఛాంపియన్ చేయడం కూడా అవసరం. ఆ ఛాంపియన్ చేసే అవకాశం ఈ కులాల్లో వుండే ధనికులకు ఇవ్వకుండా ఆ అవకాశాన్ని మనం స్వాధీనం చేసుకోవడం ద్వారా ఐక్యతను నిర్మించేందుకు సాధ్యం అవుతుంది. అందుకనే ఈ ఆర్థిక పీడన శక్తులకు వ్యతిరేకంగా పోరాటాన్ని మిళితం చేసుకుంటే తప్ప మన వర్గ ఐక్యతను మనం సాధించుకోవడం సాధ్యం కాదు. మిళితం చేయకపోతే మన వర్గ ఐక్యత బలహీనమైన ధనిక వర్గాలకు అవకాశం ఇచ్చినట్లవుతుంది. అందుకని దీన్ని అర్థం చేసుకొని మనం దీన్ని మిళితం చేసి ముందుకు తీసుకెళ్ళాలి. ఇంకొక అంశం కూడా ఏమిటంటే మార్క్సిజం మీద ఒక విమర్శ పదే పదే అనేకమంది చేస్తుంటారు. ఆర్థిక వ్యవస్థ పునాది, భావజాలాన్ని సిద్ధాంతాన్ని వాటి యొక్క ప్రభావాన్ని మార్క్సిజం గుర్తించడం లేదు అని వీరు అంటుంటారు.

"సమాజం మార్పుకు పునాది మాత్రమే (ఆర్థిక వ్యవస్థయే) కారణం. ఇంకేదీ కాదని నేను ఎప్పుడూ చెప్పలేదు. పునాది ఈ మార్పుకు కారణమైతే పునాదిలో మార్పుకు ఉపరితలం కారణమవుతుంది. ఉపరితలంలో మార్పునకు పునాది కారణం అవుతుంది. రెండూ ఆ విధంగా పరస్పరం మమేకమై ముందుకు పోతాయని చెప్పాం" అని ఎంగెల్స్ రాశారు. అంతిమంగా పునాది నిర్ణయిస్తుందని చెప్పారు తప్ప భావజాలానికి ఎటువంటి పాత్ర లేదని మార్క్స్ గాని, ఎంగెల్స్ గాని చెప్పలేదు. కుల వ్యవస్థకు, భూస్వామ్య

వ్యవస్థకు బలం ఎక్కడ వుందంటే భూకేంద్రీకరణ, ఆర్థిక వ్యవస్థను రక్షించుకునేందుకు భావజాలం విస్తృతంగా వ్యాపింపచేయబడిందని అంటున్నాం. అంటే ఈ కులతత్వ భావజాలం దీని ప్రతిఘటనను ఓడించడానికి ఉపయోగపడుతుంది. ఆ రకంగా దాని ప్రభావం వుంటుంది. అంతిమంగా భూస్వామ్య వ్యవస్థను, భూకేంద్రీకరణను బ్రద్దలు చేయకుండా కులతత్వాన్ని తొలగించగలమా? తొలగించలేము అనేది దీని సారాంశం. ఇది తక్కువ అది ఎక్కువ అని కాదు. భూకేంద్రీకరణ, భూస్వామ్య వ్యవస్థలను రద్దు చేయకుండా కుదరదు. కుల వ్యవస్థను రక్షించే భూస్వామ్య శక్తులను లేకుండా చేయాలి. మన అనుభవమే తీసుకోండి. గ్రామంలో మంచినీళ్ళు చెరువులో నీళ్ళు తెచ్చుకోనీయకపోతే దాన్ని ఎవరైనా ప్రతిఘటించినా, హోటల్లో రెండు గ్లాసుల విధానాన్ని ప్రతిఘటించినా సాంఘిక బహిష్కరణ చేస్తున్నారు. పొలాల్లో పనులకు రానివ్వరు. అంటే ఈ ప్రతిఘటనను అణచడానికి, కులతత్వాన్ని కొనసాగించడానికి వారు ఆర్థిక శక్తిని ఉపయోగిస్తున్నారు. భూకేంద్రీకరణ బ్రద్దలైపోయి భూస్వామ్య శక్తుల్లో ఈ ఆర్థిక బలం లేకపోయినపుడు ఏమవుతుంది? మనలను సాంఘిక బహిష్కరణ చేసి ఇబ్బంది పెట్టి మనలను ఓడించే శక్తి వారికి పోతుంది. భూకేంద్రీకరణ పోయిన వెంటనే భూస్వామ్య వ్యవస్థ రద్దు అయిన వెంటనే కులం, కుల భావాలన్నీ పోతాయని మనం చెప్పడం లేదు. అవి పోవు కూడా. ఆర్థిక వ్యవస్థ పోయినంత మాత్రానా ఆ ఆర్థిక వ్యవస్థలో మార్పు వచ్చినంత మాత్రానా సైద్ధాంతిక పోరాటం ఆగదు. సోషలిజం వచ్చిన తర్వాత కూడా పెట్టుబడిదారీ భావాలు కొనసాగుతాయి. పెట్టుబడిదారీ విధానం వచ్చిన తర్వాత కూడా ఫ్యూడల్ భావాలు కొనసాగుతాయి. అందుకని వాటిపై వందల సంవత్సరాలు పోరాడవలసి వుందని కారల్‌మార్క్స్ చెప్పారు.

ఇంకొక ముఖ్యమైన అంశం మన శత్రువుల బలం పోవడమే కాదు. ప్రతిఘటించే శక్తి మనకు వస్తుంది. ఎందుకని? సంఘ బహిష్కరణ చేస్తే ఎందుకు అంత బాధపడుతున్నారు? ఎందుకంటే వారికి స్వంత కాళ్ళ మీద నిలబడే బలం లేదు. బహిష్కరణ చేస్తే పుల్లలు పొయ్యిలోకి తెచ్చుకోవాలంటే వారి పొలంలోకి పోవాలి. కూలికి పోవాలంటే అక్కడకు పోవాలి. వాళ్ళకేమైనా ఒక మేకలాంటిది వుంటే వారి పొలాల గట్లు పైకి పోవాలి. ఆర్థిక బలం వస్తే ప్రతిఘటించే శక్తి వస్తుంది.

భూ సంస్కరణల వలన రెండు పరిణామాలు జరుగుతాయి. ఒకటి కుల వ్యవస్థను రక్షించేవాళ్ళకు శక్తి లేకుండా పోతుంది. ఆర్థిక స్థితిని ఉపయోగించుకొని పేదలను అణచివేసే అవకాశం పోతుంది. పేదలకు తమ కాళ్ళపైన తాము నిలబడే శక్తి వస్తుంది.

ఇతరులపై ఆధారపడని స్థితి నెలకొంటుంది. దానివల్ల తమ ప్రతిఘటనలను ధైర్యంగా ముందుకు తీసుకొనిపోయే వీలు దొరుకుతుంది. అంతిమంగా అది విజయం సాధించే అవకాశానికి ప్రాతిపదిక ఏర్పడుతుంది. కుల భావాలు పూర్తిగా పోవు. ఆ కుల భావాలు పోవడానికి మనం భావజాల పోరాటం కొనసాగించాలి. ఈ కుల భావాలకు పునాదులైన ఏ సిద్ధాంతాలు వుంటే ఆ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం జరగాలి. ఆ కుల భావాలు ఏ మేరకు ఎట్లా బలహీనపరచగలిగినా – సహ పంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు, దేవాలయ ప్రవేశాలు ఇలాంటి వాటినన్నింటిని ప్రోత్సహించాలి. ఇట్లాంటివన్నీ జరుగుతున్నప్పుడు తమకు శక్తి లేకపోయినా తమ పాతకాలపు అహంకారంతో మనమీద పెత్తనం చేయడానికి ప్రయత్నం చేస్తే మనకు కొత్తగా వచ్చిన శక్తిని ఆసరాగా చేసుకుని వారిని ప్రతిఘటించవచ్చు. ఇంతకుముందులాగా మనపై పెత్తనం చేయడం కుదరదు. ఎందుకంటే వారికి శక్తి లేదు కాబట్టి మనకు కొత్త శక్తిగా ఆర్థిక పునాది వచ్చింది కాబట్టి. ఆ పునాది పోయిన తర్వాత ఈ ఉద్యమాలన్నింటికి ఇంతకుముందు లేని శక్తి వస్తుంది. ఇంతకుముందు జయప్రదం కాని ఉద్యమాలు ఇప్పుడు జయప్రదమవుతాయి.

దళిత ఆపద్బాంధవుడుగా పేరొందిన డాక్టర్ అంబేద్కర్ ఎంత కష్టపడ్డారు? అయినా పూర్తిగా జయప్రదం కాలేకపోయారు. జ్యోతిబాపూలే లేక రామస్వామి నాయకర్ లాంటి పాతవారు చాలా కష్టపడ్డారు. జయప్రదం కాలేకపోయారు. కాని బెంగాల్‌లో, కేరళలో ఎందుకు కొంతవరకు జయప్రదమయ్యాం? అంటే అక్కడ కుల భావాలు పోయాయని కాదు. కాని అక్కడ జరిగిన పరిణామాల మూలంగా, ఏ రాష్ట్రంలో లేనట్లుగా అతి తక్కువ అత్యాచారాలు, అతి తక్కువ వివక్షత అక్కడ వుంది ఎందుకని? పునాదిని బలహీనం చేయడం జరిగింది కాబట్టి. అంతేకాదు, భూసంస్కరణలను చేయడంతో పాటు పంచాయతీ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా కూడా అది జరిగింది. భూమి వ్యవస్థ వివరాలు తీస్తే దేశంలో నూటికి 30 మంది చేతిలో 70 శాతం భూమి వుంది. బెంగాల్ లెక్కలు తీస్తే నూటికి 70 మంది చేతిలో 70 శాతం భూమి వుంది. అంటే అత్యధిక ప్రజానీకం చేతిలో అత్యధిక భూమి వచ్చింది. ఆ అత్యధిక ప్రజానీకం ఎవరు? దళితులు, వెనుకబడిన కులాలవారు, మైనారిటీలు. దీనివల్ల క్రింది వారిపై పెత్తనం కుదరదు. పంచాయతీల్లో అధికంగా క్రింది వర్గాల వారు, మహిళలు కూడా గెలిచివున్నారు. ఇక్కడ మనకు ఈ రిజర్వేషన్ పంచాయతీలు వచ్చినా చక్రం తిప్పేవారు ఎప్పుడూ

భూస్వామ్య వ్యవస్థ కుటుంబాల వారే. బెంగాల్‌లో చక్రం తిప్పే అవకాశం వారికి లేకుండా పోయింది. ఎవరైనా అగ్ర కుల భావజాలం తోటి పెత్తనం చేయబోతే అది కుదరదు.

## 5. అధికారమా - అవకాశవాదమా

అధికారం ద్వారా అంతా సాధించవచ్చని, అధికార పదవులు చేపట్టడం ద్వారా మాత్రమే కులపీడనను నాశనం చేయడం సాధ్యమని కొందరు భావిస్తున్నారు. ఏ పార్టీలో, ఏ ప్రభుత్వంలో, ఏ పదవుల్లో ఏ కులంవారు ఎంతమంది వున్నారు. అని లెక్కలు గట్టి, దాన్ని బట్టి బలహీనవర్గాలకు అనుకూలమో, వ్యతిరేకమో వీరు నిర్ణయిస్తుంటారు.

### అధికారం అంటే ఏమిటి?

అధికారం పదవుల్లో వుందనుకోవడం పొరపాటు. అధికారం ఆస్తి సంబంధాల్లో వున్నది. ఆస్తి సంబంధాలను రక్షిస్తున్న రాజ్యాంగంలో, చట్టాలలో, నిరంకుశాధికార యంత్రాంగంలో, కాపలా పోలీసు వ్యవస్థలో వున్నది. ఈ వ్యవస్థలను బట్టే అధికారం ఎవరి చేతుల్లో వుందనేది నిర్ణయించబడుతుంది. నేడు ఈ అధికారం ధనాఢ్యవర్గాల చేతుల్లో వుంది. ఉన్నత పదవుల్లోకి ఎవరు వచ్చినా, ఆ వర్గాల కోసం అధికారాన్ని వినియోగించాల్సిందే. ఈ రోజు మాయావతిగాని, ములాయంగాని చేసింది అదే.

ఈ విషయాన్ని అర్థం చేసుకుని వున్న వ్యవస్థ లోపలే కొంతమేరకు బలహీన వర్గాలకు అధికారం బదలాయించాలంటే చేయాల్సింది. 1. భూసంస్కరణలు చేయడం, 2. పంచాయతీ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణ చేయడం, 3. ప్రభుత్వ రంగాన్ని రక్షించడం మొదలగు అంశాలను అమలు జరపాలి.

ప్రజా ప్రాతినిధ్య సంస్థల్లో ఎస్.సి., ఎస్.టి.లకు రాజ్యాంగంలోనే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. పార్లమెంట్, శాసనసభల్లో రిజర్వేషన్లున్నాయి. ఇతర ప్రజా ప్రాతినిధ్య సంస్థల్లో సైతం ఎస్.సి., ఎస్.టి.లతో పాటు వెనుకబడిన కులాలు, మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. మహిళలకు వెనుకబడిన కులాలకు పార్లమెంట్, శాసనసభల్లో రిజర్వేషన్లు కావాలని డిమాండ్లు వున్నాయి. అవి రాబోయే కాలంలో ఆమోదించబడవచ్చు. ప్రాతినిధ్య సంస్థల్లో ఇప్పటి వరకు అమలు జరిగిన అనుభవాన్ని పరిశీలిస్తే, ఇవి కుల వివక్షతను రూపుమాపడానికి తోడ్పడ్డాయని చెప్పలేం. అయితే అధికారం అంటే కొన్ని పదవులు కాదు. ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు కావడంగా కొంత మంది చెబుతున్నారు. ఈ విషయంలో సైతం తగినంత అనుభవం

వున్నది. ఈ నినాదాలతోనే శ్రీమతి మాయావతి, ములాయం, లాలూలు ముఖ్యమంత్రులయ్యారు. వారి హయాంలోనూ కులపీడనను ప్రతిఘటించడానికి ప్రయత్నం జరగలేదు. గతంలోను అనేక రాష్ట్రాలలో దళితులు, వెనుకబడిన తరగతుల నుండి ముఖ్యమంత్రులు అయిన సందర్భాలున్నాయి. అయినా కులపీడనలో పెద్దగా మార్పు లేదు.

అందువలన అధికారం పొందడమంటే ఆయా కులాలలోని కొంతమంది అత్యున్నత పదవులు పొందడంగా చిత్రించి నడిపన ఉద్యమాలు, పార్టీలు కులపీడనను తొలగించడంతో విఫలమైనాయి. ఆయా కులాలలోని కొంతమంది వ్యక్తులు లాభపడేందుకు ఉపయోగించుకున్నారు. నిజమైన అధికారాన్ని అనుభవించే శక్తి కూడా ఈ భూస్వామ్య వ్యవస్థను బ్రద్దలు చేయడం ద్వారా వస్తుంది తప్ప అది వున్నంత కాలం దళితులకు రిజర్వేషన్లు ఇచ్చినా నిజమైన అధికారం వారి చేతుల్లోకి రాదు. ఈ రోజు మన రాష్ట్రంలో చూస్తే దళిత సర్పంచ్‌లు, పేద సర్పంచ్‌లు చాలామంది వున్నారు. వారేమీ తెలివితక్కువ వాళ్ళు కాదు. చేతకానివారు కాదు. కాని ఎక్కడైతే భూస్వామ్య పెత్తనం వుందో తమ అధికారాన్ని తాము అనుభవించే శక్తి కూడా లేకుండా పోతున్నది. అందుకని మనం ఈ భూపంపిణీ ద్వారా భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు శక్తి పెరుగుతుంది. గతంలో సాధించిన దానికన్నా ఎక్కువ విజయాల్ని సాధించే అవకాశం కూడా వస్తుంది.

## 6. అన్ని కులాలలోని పేదల ఐక్యత కావాలి

అలాగే భూస్వామ్య వ్యతిరేక ఉద్యమం ద్వారా అన్ని కులాలలోని వారు కలిసిన వర్గ ఐక్యత ఏర్పడుతుంది. ఇప్పుడు ఈ కుల పోరాటాల ద్వారా ఏమవుతుంది? అన్ని వర్గాలు కలిసిన కుల ఐక్యత ఏర్పడుతుంది. భూస్వామ్య వ్యతిరేక పోరాటం ద్వారా అన్ని కులాల్లో వున్న పేదల ఐక్యత ఏర్పడుతుంది. అంటే కులతత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఆ కులం వారే కాకుండా, అన్ని కులాల వారు కలిసి పోరాడేందుకు అవకాశం వస్తుంది. అంటే దళితుల మీద జరిగే అత్యాచారాలపై అగ్రకులాల్లో వుండే పేదలను కూడా సమీకరించే అవకాశం దీనివల్ల వస్తుంది. తద్వారా కులతత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు విశాల మద్దతకు వేదిక ఏర్పడుతుంది. సంకుచితమైన మనస్తత్వంతో దళితుల సమస్యలను దళితులే తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తే కుల పీడన పోదు.

## 7. చట్టాలు - సంపన్నుల చుట్టాలు

చట్టాలను అమలు జరిపించడం ద్వారా కుల వివక్షతను రూపుమాపవచ్చని కొంతమంది భ్రమపడుతున్నారు. ఐక్యంగా పోరాటం చేస్తే తప్ప చట్టాలను అమలు జరిపించుకోవడం కూడా సాధ్యంకాదు. ఆ చట్టాలు కూడా పోరాటాల ద్వారానే వచ్చాయి. అయినా చట్టాలను అమలు చేసే యంత్రాంగం కులవివక్షత కొనసాగించే శక్తులతో నిండి వున్నది. కులవివక్షత వలన లాభం పొందే శక్తులు తమ ఆర్థిక శక్తితో వున్న చట్టాలను అమలు కాకుండా తమకనుకూలంగా ప్రభావితం చేయగల్గుతున్నారు.

## 8. వివక్షతను సహించకూడదు - వివక్షతను చూపకూడదు

కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడటం అంటే తమపై జరిగే వివక్షతకు వ్యతిరేకంగా పోరాడటమే కాదు, తాము ఇతరులపై వివక్షత చూపకుండా వుండటం నేర్చుకోవాలి. తమ మీద వివక్షత చూపే అవకాశం ఇతరులకుండరాదు. తమకున్న అవకాశానన్ని మాత్రం వదులుకోం అన్న వైఖరి వున్నవారు, తమపై జరిగే వివక్షతను కూడా ఎదిరించజాలరు. వెనుకబడిన కులాల వారు తమపై వివక్షతను వ్యతిరేకించడమే కాదు. తాము దళితుల పట్ల వివక్షతను చూపరాదు.

దళితుల్లో సైతం వివిధ కులాల మధ్య వ్యత్యాసాలు చూపుతున్న పరిస్థితి వున్నది. దళిత పురుషులు, దళిత స్త్రీల పట్ల వివక్షత చూపుతుంటారు. దళితులు తమపై జరుగుతున్న అమానుష అణచివేత వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలంటే, దళితులు అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఏ వర్గం, ఏ తరగతి మీద అణచివేత జరుగుతున్నా వారికి సంఘీభావంగా నిలబడాలి. అప్పుడు తమ అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో విశాల మద్దతు లభిస్తుంది.

కార్మిక వర్గమనేది ప్రపంచంలో అన్ని కష్టాలను అనుభవించాల్సి వస్తోంది. కష్టాలంటే ఏమిటో కార్మిక వర్గానికి తెలుసు. అందువల్ల ప్రపంచంలో ఎవరు కష్టపడ్డా ఆ కష్టాలు కార్మిక వర్గమంతా తమవిగా భావించి వారికి అండగా నిలబడాలి. అప్పుడే ఈ సమాజాన్ని మార్చగలం అని మార్క్స్ ఒకచోట చెప్తాడు. దేశంలో జరిగే అవమానాలు, అక్రమాలు, దౌర్జన్యాలు అన్నింటిని దళితులు అనుభవిస్తున్నారు. దళితులు అనుభవించే అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు అన్నీ ఇతరులు అనుభవించరు. అయితే, అందరూ

ఒక్కొక్కటి అనుభవిస్తుంటారు. అందుకని ఎక్కడ దౌర్జన్యం జరిగినా వారందరికి దళితులు సంఘీభావాన్ని తెలియజేయడం ద్వారా వారి మద్దతును సంపాదించాలి. అప్పుడే అందరి విముక్తి సాధ్యమవుతుంది. అంటే 'అందరి విముక్తి సాధ్యమైతే తమ విముక్తి సాధ్యమవుతుంది', అని దళితులు గమనించాలి. తమ ఒక్కరి విముక్తినే సాధ్యం చేసుకోవాలంటే సాధ్యం కాదు. వర్గ పోరాటంతో భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేయడం ద్వారా ఈ భావం దళితులకు వస్తుంది. సంఘీభావం తెలపాలని ఇతరులకు కలుగుతుంది. ఇది కూడా ఒక ముఖ్యమైన అంశం. తెలంగాణా సాయుధ పోరాటంలో ఇదే మనకు కనిపించేది. అలాగే బెంగాల్‌లో ఇలాంటి పోరాటాలు జరగడం వల్లనే పేదల్లో ఐక్యత ఏర్పడింది. అయితే అక్కడ కులం పోయిందని కాదు. కుల భావాలు చాలా బలహీనపడిపోయాయి. కుల భావాల వల్ల కులాల మధ్య వ్యత్యాసాలు, ఒకరినొకరు తక్కువగా చూసుకోవడాలు చాలావరకు బెంగాల్‌లో తగ్గిపోయాయి. ఇక్కడ తెలంగాణా ప్రాంతాల్లో కూడా వీర తెలంగాణా పోరాటం ఎక్కడైతే పెద్ద ఎత్తున సాగిందో ఆ ప్రాంతాల్లో ఇప్పటికీ కులాలు పోయాయని కాదు. కాని మన రాష్ట్రం అంతటికంటే అక్కడ తక్కువ వుంటుంది. అందుకని మనం ఈ వర్గ పోరాటాన్ని ఉధృతం చేయాలి. భూకేంద్రీకరణను బద్దలు చేయాలి. ఆ పద్ధతిలో చేసే పోరాటానికి ఈ కులపీడన వ్యతిరేక పోరాటాన్ని జోడించాలి. సమ్మేళనం చేయాలి. ఇదే ఏకైక మార్గమని మనం చెప్తున్నాం.

ఈ విషయాన్ని మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఇది అర్థం చేసుకుంటే మిగతా సిద్ధాంతాలన్నింటిని తిప్పికొట్టడానికి, మనం పక్కదారులు తొక్కకుండా జాగ్రత్త వహించడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనమీద కూడా ప్రభావం పడుతుంది. చుట్టూ ఊదరగొట్టేస్తున్నారు. కుల సంఘాలు, కుల భావాలు రకరకాలుగా వచ్చేస్తున్నాయి. ఆ రకమైన ప్రభావంలో మనం పడకుండా వుండాలి.

అన్ని రంగాలలో కుల సంఘాలు పుట్టుకొస్తున్నాయి. కుల ప్రాతిపదికపై రాజకీయ పార్టీలు ఉద్భవిస్తున్నాయి. తమ కులానికి జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటించాలన్న ప్రాతిపదికపై కుల భావనలను రెచ్చగొట్టి, ప్రజలను సమీకరించడం జరుగుతున్నది.

**కుల ఉద్యమాలు - రెండు విరుద్ధ అంశాలు**

కుల ప్రాతిపదికగా ముందుకొస్తున్న ఈ ఆందోళనలు, ఉద్యమాలలో రెండు అంశాలను మనం గమనించాల్సి వుంది. ఒకటి, కుల పీడనకు వ్యతిరేకంగా, వివక్షతకు

వ్యతిరేకంగా ప్రతిఘటించాలన్న ప్రజల ఆకాంక్ష, ప్రజాస్వామిక అంశంగా ఈ ఉద్యమాలలో ఉన్నది. ప్రజలు ప్రధానంగా ఈ అంశాన్ని బట్టి ఆకర్షితులవుతున్నారు. ఇది ప్రజాతంత్రమైన భాగం. ఈ అంశాన్ని మనం గుర్తించాలి. బలపర్చాలి. రెండవది, ఈ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న మధ్యతరగతి, ఆయా కులాలలో వస్తున్న ప్రజాతంత్ర చైతన్యాన్ని ఉపయోగించుకుని ప్రస్తుత వ్యవస్థలోనే తమకు సముచిత స్థానం సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కులంలోని సామాన్య ప్రజల సమస్యలపై ప్రజలను సమీకరించుకోవడానికి ఉపయోగించుకుని తమ స్వార్థాన్ని నెరవేర్చుకునేందుకు, పదవులలో భాగస్వామ్యం కోసం వినియోగించుకుంటున్నారు. ప్రజలు ప్రయోజనాన్ని కులంలోని కొంతమంది పదవులను పొందడానికి కుదిస్తున్నారు. ఈ క్రమంలో కులంలోని ప్రజల ప్రజాతంత్ర చైతన్యాన్ని ప్రక్కత్రోవలు పట్టించి వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారు. పాలక వర్గాలకు సాయపడుతున్నారు.

స్వాతంత్ర్యానంతరం పార్లమెంటరీ ఎన్నికల పద్ధతి దేశంలో అనుసరించబడుతున్నది. కుల భావాలను సంఘటితం చేయడం ద్వారా ఈ ఎన్నికలలో లబ్ధి పొందే అవకాశం ఏర్పడింది. ఎన్నికలలో ఓట్లు సాధించడానికి, పదవులు పొందడానికి కూడా ఆయా కులాలలోని మధ్య తరగతి కుల భావాలను పెంచి పోషిస్తున్నారు. కుల వివక్షత, పీడనను పోగొట్టుకోవాలని పెరుగుతున్న ప్రజాతంత్ర చైతన్యాన్ని ఈ మధ్యతరగతి సంకుచిత కుల చైతన్యంగా మార్చి ఎన్నికలలో ఓట్ల కోసం వినియోగించుకుంటున్నది. పాలక పార్టీలు ఈ అంశాన్ని వినియోగించుకుంటున్నాయి.

కుల సంఘీభావంపై ఆధారపడ్డ సిద్ధాంతంలో అంతర్లీనమై వుండే విషయమేమంటే ఇతరులు మన వారు కాదు కాబట్టి వారికి దూరంగా వుండాలి అనేది. అందుకని కుల సంఘీభావ ఉద్యమం అనేది ఒకవైపున ఐక్యం చేస్తుంది. ఇంకొకవైపున విచ్ఛిన్నం చేస్తుంది. తమ కులంలో వున్న వారిని ఐక్యం చేస్తుంది. ఇతర కులాల్లో వున్న వారిని దూరంగా వుంచుతుంది. మాల, మాదిగ సంఘాలని చెప్పుకునే మాదిగ దండోరా, మాల మహానాడు స్వభావం కనిపిస్తూనే వుంది. అందుకని ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో దళితులు ఒక పార్టీ వెనక చేరితే, వెనకబడిన తరగతుల వారు ఇంకొక పార్టీ వెనుక చేరారు. ఆ రకంగా వారు ఒకరినొకరు కొట్లాడుకొని కోతికి కొబ్బరినిచ్చినట్లుగా ఉత్తరప్రదేశ్‌లో వ్యవహారం కనపడుతుంది. బి.ఎస్.సి., ఎస్.పి.ల మధ్య బి.జె.పి. లాభపడుతున్నది. కనుక ఈ కులం పేరుతో ఐక్యం చేసిన అంశం ఎంత ప్రధానమో ఈ కులం పేరుతోటి ఐక్యం కావలసిన వారిని దూరం చేసిన ప్రభావం వుంది. ఐక్యం – అనైక్యం అనే రెండూ అందులో వున్నాయి అని అర్థమవుతుంది. అందుకని కుల

సంఘీభావం అనేదాన్లో ఈ ప్రమాదం కూడా ఇమిడి వుంది. దాన్ని ఇంతకుముందు చెప్తే అర్ధమయ్యేది కాదు. దేశంలో ఏ మూల చూసినా స్పష్టంగా ఆచరణలో కళ్ళకు కట్టిపడినట్లు ఇప్పుడు కనపడుతుంది. అందుకని ఆ తరగతుల్లో వున్న ప్రజానీకం కూడా మనం చెబుతున్నది అర్ధం చేసుకునే పరిస్థితి వుంది. దీన్ని కూడా మనం గమనంలో పెట్టుకోవాలి.

### ఉదారవాద ఆర్థిక విధానాలు బలహీన వర్గాలకు ప్రమాదం

సామ్రాజ్యవాద సంస్థలైన ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్., డబ్ల్యు.టి.ఓ.ల వత్తిడి మూలంగా ప్రవేశపెట్టబడిన నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు వచ్చిన తర్వాత సామాజిక న్యాయానికి తీవ్ర ప్రమాదం ఏర్పడింది. ప్రైవేటీకరణ విధానాల మూలంగా రిజర్వేషన్ల ప్రయోజనం దెబ్బతింటున్నది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, సబ్సిడీల, సంక్షేమ కార్యక్రమాల కుదింపు, భూసంస్కరణల అమలు నిర్వీర్యం కావడం, చేతివృత్తులు దెబ్బతినడం మూలంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, వృత్తిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీరిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారయినందున భారాలన్నీ ఈ తరగతుల మీద పడుతున్నాయి. సామాజిక వివక్షతకు వ్యతిరేకంగా పోరాడే శక్తి ఇంకా బలహీనపడుతున్నది. ఈ భారాల మూలంగా ఈ తరగతులలో అసంతృప్తి తీవ్రమవుతున్నది. పెరుగుతున్న ఈ అసంతృప్తిని కుల సంఘాలు, సంకుచిత ఉద్యమాల వైపుకు మళ్ళించి కొంతమంది పాలక వర్గాలకు సహాయపడుతున్నారు.

### మతతత్వాన్ని ఎదిరించకుండా కుల వివక్షతను రూపుమాపలేం

కుల వ్యవస్థ యొక్క ఆర్థిక పునాదిని నాశనం చేయడానికి కృషి చేయడంతో పాటు, కుల వ్యవస్థను కాపాడటానికి సృష్టించిన భావజాలం మీద నిరంతరం పోరాటం చేయాలి. సనాతన హిందూ ధర్మం పేరు మీద, పురాణాలు, ధర్మశాస్త్రాల పేరుతో కుల వ్యవస్థను రక్షించే వాదనలను బట్టబయలు చేయాలి.

దేశాన్ని 'హిందూత్వ' మత రాజ్యంగా తీర్చిదిద్దాలనుకుంటున్న ఆర్.ఎస్.ఎస్., విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, వాటి రాజకీయ విభాగాలైన బిజెపి, శివసేన పార్టీలు సనాతన హిందూ ధర్మానికి రక్షణగా ముందుకొస్తున్నాయి. మనుధర్మశాస్త్రాన్ని కాపాడజూస్తున్నాయి. ఈ శక్తులు తమ కులతత్వాన్ని మాటల్లో కప్పిపుచ్చుకోచూస్తున్న

భూస్వామ్య సంస్కృతిని, కుల వ్యవస్థను కాపాడటమే 'హిందూత్వ' నినాదం యొక్క సారాంశం. కులపీడనను ఎదరించదల్చుకున్నవారు మతతత్వంపై పోరాడాలి. దురదృష్టవశాత్తు కొందరు రాజకీయ అవకాశవాదంతో దళిత ప్రతినిధులమని చెప్పుకుంటూనే మతతత్వ శక్తులతో పొత్తులు కలుపుకుంటున్నారు. బి.ఎస్.పి., మాదిగ దండోరాల నడవడిక ఇందుకు ప్రబల ఉదాహరణలు. కులపీడనకు వ్యతిరేకంగా పోరాడదల్చుకున్నవారెవరైనా 'హిందూత్వ' మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడటం అవసరం.

ముఖ్యంగా బి.టి. రణదివె రాసిన "కులం – వర్గం – ఆస్తి సంబంధాలు" పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. మన తీర్మానాలన్నింటిలో వున్నాయి. వాటిని కూడా అధ్యయనం చేయాలి. పట్టు సంపాదించాలి. పట్టు సంపాదించినపుడే ఇతర సిద్ధాంతాలన్నింటిని మనం ఒక ఆత్మవిశ్వాసంతోటి ఎదిరించి, సరియైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించేందుకు అవకాశం వుంటుంది.

ఇది అవగాహన చేసుకున్న తర్వాత మనం రాబోయే కాలంలో ఈ పోరాటాన్ని మిళితం చేసి, పేద ప్రజలనందరినీ పెద్ద ఎత్తున సమీకరించే కృషి చేయాలి. దాని ప్రాతిపదికగా మన పార్టీకి లేక మన ప్రజా సంఘాలకు అనుభవం సంపాదించేందుకు ఒక సాధనంగా వుండే కార్యక్రమాన్ని ఇప్పుడు మనం తీసుకుంటున్నాము.

**ఆచరించడం ముఖ్యం**

ఇంతవరకు కుల సంఘాలు మాటల పోరాటం తప్ప ఏమీ చేయలేదు. అత్యాచారం జరిగిన తర్వాత డబ్బులివ్వమనేది ఆ పోరాటం. ఇప్పుడున్న దాన్ని ఎలా అధిగమించాలి? అనే దానిపై పోరాట కార్యక్రమం లేదు. ఏ కుల సంఘమైనా తీసుకోండి. జరిగిన తర్వాత డబ్బులివ్వమనడం, శిక్షించమనడం, మీటింగులో ఆవేశపూరిత ఉపన్యాసాలివ్వడం కార్యక్రమం. స్పష్టంగా ఒక వివక్షతా రూపం తీసుకొని ఆ రూపాన్ని మేము ప్రతిఘటిస్తామనే కార్యక్రమం లేదు. ఈ రోజు మనం ఒక పాజిటివ్ కార్యక్రమం తోటి ముందుకు వస్తున్నాము. ఉపన్యాసాలు కులం గురించి చెప్పాలంటే, మనకంటే వారే బాగా చెప్తారు. దాన్లో మనం పోటీపడలేము. కాని మన శక్తి ఏమిటో మనం రుజువు చేసుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ పోరాట కార్యక్రమాలు చేయాలి.

# మతం - - శాస్త్రీయ అవగాహన

## 1. ఆదిమ మానవుడికి మతం

దైవ భావన లేవు. అతని సమస్య ప్రకృతి శక్తులతో పోరాటం. తన మనుగడకై తపన, ప్రయత్నం, ఆహార సంపాదన, ఆహార ఉత్పత్తి, దానికోసం రూపొందించుకునే సాధనాలు.

– మానవుడిని జంతువు నుండి వేరు చేసే ప్రధాన అంశం "ఆలోచన".

– వర్గ సమాజం ఆవిర్భావంతో – అతడికి 'విరామం' లభించింది. దానితో 'ప్రశ్న', 'శోధన', 'ఊహ', 'ఆచరణ', 'అవగాహన', 'అనుభవం' పెరిగాయి.

**ఇది రెండు రకాల విజ్ఞానానికి కారణమైంది.**

**1. శాస్త్ర విజ్ఞానం**

ఉదా : నిప్పు – ఆహార పచనం

వ్యవసాయం – నాగలితో

ప్రయాణం – చక్రం ఉపయోగం

ఆవాసం – గుడిశె

కమ్యూ్యనికేషన్ – భాషతో

**2. తత్వశాస్త్రం**

వ్యక్తి – సమాజం – ప్రకృతి

వీటి పరస్పర సంబంధం - వీటి సాధారణ సూత్రాలు - వాటి విశ్లేషణ తత్వశాస్త్రం రెండు ప్రధానమైన ధోరణులలో నడిచింది.

**1. భౌతికవాదం, 2. భావవాదం.**

**1. భౌతికవాదం :**

మన జ్ఞానేంద్రియాలతో తెలుసుకోగల ప్రకృతి - వాస్తవం. ఇది భ్రమాజనితమూ కాదు - మిధ్యా కాదు. ఈ ప్రకృతిలో కొన్నింటిని ప్రత్యక్షంగా, కొన్నింటిని పరోక్షంగా తెలుసుకోగలుగుతున్నాము. దీనికే "పదార్థం" (Matter) అనే తాత్విక పదం ఉపయోగిస్తున్నాము. ఈ పదార్థం స్థాణువుగా లేదు. నిత్య చలనం (Motion)లో వుంది. పదార్థం - చలనం వేరు వేరు కాదు. ఇది కొన్ని ప్రాకృతిక, చలన సూత్రాలకు లోబడి వుంది. వాటినే "గతి తార్కిక సూత్రాలు" (Dialectical Laws)అంటున్నాము. (వీటి వివరణ వేరే సందర్భంలో చేయవచ్చు). ఈ సూత్రాలు సమాజ పరిణామ క్రమానికి అన్వయించవచ్చు.

**2. భావవాదం :**

ఈ ప్రకృతి, ప్రకృతి శక్తులూ వాస్తవం కాదు. ఊహ, భ్రమ. "నీవున్నావు గనుక అవి వున్నట్లు అనిపిస్తున్నాయి. 'వాస్తవం' వేరే వుంది. దాని ప్రతిబింబం మాత్రమే ఇది. లేదా దాని సృష్టే 'ఇది'. అది అతీత శక్తి - నిత్య చైతన్యం (True Consciousness). ఆది మధ్యంత రహితం. అది ఆత్మ - విశ్వాత్మ - పరమాత్మ - చైతన్యం, విశ్వచైతన్యం - సత్యం - అఖండ సత్యం - బ్రహ్మాన్ పరబ్రహ్మాన్.

## 2. మతం

ఈ భావవాదం యొక్క ఒక బలమైన శాఖ 'మతం' అనిత్య సత్య చైతన్యాన్ని "దైవం" - "దేవుడు"గా సృష్టికర్తగా భావించి - దాని చుట్టూ కొన్ని విధులూ, కొన్ని అద్భుతాలూ - కథలూ, ప్రవక్తలూ, సూక్తులూ.

విజ్ఞానశాస్త్రానికి Reasoning (తర్కం) ప్రాతిపదిక అయితే మతానికి మూలస్తంభం FAITH (విశ్వాసం).

ఇక్కడ ఆలోచనకూ, ప్రశ్నకూ – పరిశీలనకూ – పరిశోధనకూ తావులేదు. క్రమంగా స్తబ్దత – మౌఢ్యం చోటు చేసుకున్నాయి. పూజలు, పునస్కారాలు, ప్రార్ధనలూ, కీర్తనలూ, క్రతువులు.

దీనికి (సమాజ పరిణామ క్రమంలో) వివిధ దశలు కనిపిస్తాయి. ప్రకృతి ఆరాధన (చెట్టు, పుట్ట, రాయి, పాము) ఊహాజనిత వికృత రూపాల ఆరాధన (నరసింహ, గణేష్), మానవాకృత భావన (Anthro Po Morphism), బహుదేవతారాధన (Polytheism), ఏకీకృత భావన (Monothism), నైరూప్యం (Pantheism).

దేవుడిని కేంద్రంగా చేసుకున్న మతాలు (సేశ్వర)తో పాటు దేవుడి ప్రసక్తి తీసుకురాని (నిరీశ్వర) మతాలు కూడా వున్నాయి. ఉదా : బౌద్ధం, జైనం, చార్వాకం.

కొన్ని మతాలు వ్యవస్థీకృతం – ఒక గ్రంథం, ఒక ప్రవక్త వగైరా కొన్ని అవ్యవస్థీకృతం.

ఉదా : వైదికం

భారతదేశంలో దర్శన గ్రంథాలుగా చెప్పబడుతున్న షడ్ దర్శనాలు వైశేషికం (కణాద), న్యాయ (గౌతమ), సాంఖ్య (కపిల), యోగ (పతంజలి), పూర్వ మీమాంస (జెమిని)ల్లో దైవ ప్రసక్తి నామమాత్రం. ఉత్తర మీమాంస (ఆది శంకర)లో మాత్రమే బలమైన (ఆదీ నామ రూప రహిత విశ్వ చైతన్య) అద్వైత పరమాత్మ ప్రతిపాదన.

మతం, దైవం మానవ మేధో జనితం. భిన్న భౌగోళిక సామాజిక స్థితిగతుల నుండి ఆవిర్భావం. శాశ్వత సత్యాలు వుండవు. అన్నీ సాపేక్షికం (Relative) మాత్రమే.

**మతం - మూడు పొరలుగా రూపొందింది**

1. కేంద్రంలో “ఆధ్యాత్మికత” – విశ్వాసం – వైయక్తికం – భక్తి భావన

2. ఆ పైన – ఆచార వ్యవహారాలు – కర్మకాండలు వేషభాషల్లో ప్రత్యేకత.

3. తుది పొరలో – సామాజిక సూత్రాలు. ఉదా : సత్యంవధ, ధర్మంచర, పొరుగువాడిని ప్రేమించు, దాన ధర్మాలు చేయడం.

మతం – పాలకవర్గాల చేతిలో ఆయుధంగా ఉపయోగపడుతూ వచ్చింది. మతాచార్యులూ – రాజ్యాధిపతులూ ఏకమయ్యారు. “నా విష్ణుః పృధ్వీపతిః (రాజును

మించిన దైవం లేదు) అనిపించారు. దేవాలయాలు – పాలకుల ధనాగారాలుగా ఉపయోగపడ్డాయి.

పాపం – పుణ్యం – పూర్వజన్మ – కర్మ – స్వర్గం – నరకం – ముక్తి – మోక్షం – దైవభీతి భావాలన్నీ పాలక వర్గాలకు అనుకూలంగా మలచబడ్డాయి. ఆధిపత్య వర్గ భావనలు – అణగారిన వర్గాల భావనలుగా వారికి మేధో ప్రక్షాళన (Brainwash) ద్వారా ఎక్కించబడినాయి. ఆధిపత్యాన్ని ఎదిరించకుండా పడివుండటానికి ఉపయోగపడినాయి. బలహీనుడిని బలవంతుడు దోచుకోవడానికి, అణచి వుంచడానికి ఒక సాధనంగా (Legitimacy) ఏర్పరచబడింది.

అందుకే మార్క్స్ – మతాన్ని మత్తు మందుగా చిత్రీకరించాడు. ఈ నిర్ణయానికి వచ్చే ముందు ఆయన మతం – అణగారిన జీవికి ఇచ్చిన స్వాంతన గూర్చి కూడా చెప్పారు. మతాన్ని గురించిన లోతైన విశ్లేషణ ఆయనది :

"కష్టాల్లో వున్న మనిషికి" ఒక ఊహాజనిత సౌఖ్యాన్నిస్తుంది మతం". కావల్సింది వాస్తవ సౌఖ్యం – దుఃఖాన్ని వ్యక్తం చేయడానికి ఒక మార్గం మతం – మనిషి చింతలకు నిరసన యిది – అణగారిన జీవి నిట్టూర్పు మతం – హృదయం లేని ప్రపంచానికి హృదయం మతం – అది ఆత్మలేని సమాజానికి ఆత్మలాంటిది – అణచివేతకు గురియైన వానికి స్వాంతన, ఓదార్పు ఇస్తుంది. ఆ విధంగా మతం మానవుడికి మత్తుమందుగా పనిచేసింది."

- మార్క్సిజం మత విద్వేషి అనే ప్రచారంలో వాస్తవం లేదు.
- ప్రజలపై మతం పట్టును కొనసాగించే కారణాలపై దాడి చేస్తుంది.
- దోపిడీకి మతం ఒక కారకంగా ఉపయోగపడే సామాజిక పరిస్థితులకు మాత్రం మార్క్సిజం వ్యతిరేకి.
- ప్రజలు తమ కష్టాలకు నిజమైన – అసలైన కారణాలు తెలుసుకునేందుకు అవరోధంగా వున్న మతాన్ని.
- కష్టజీవుల ఐక్యతకు, ఐక్య పోరాటాలకు అడ్డంకిగా వున్న మతాన్ని వ్యతిరేకిస్తుంది.

## 3. మత ఉన్మాదం

మనిషి పుట్టుకను బట్టి అతని మతం నిర్ణయించబడుతుంది. పుట్టుక కాకతాళీయం (It is an accident - Not Choice). అక్కడి నుండి మత భావన – విశ్వాసం – ఆ మతాభిమానం ఉగ్గుపాలతో ప్రవేశపెట్టబడుతున్నాయి.

ఈ అభిమానం – దురభిమానంగా – పరమత విద్వేషంగా రూపాంతరం చెందుతుంది.

ఒక తాత్వికత నుండి ఉన్మాదానికి (Vulgarisation of Religion) దారి తీస్తున్నది.

- మధ్యయుగాల్లో మత యుద్ధాలు (Wars of Crusade) జరిగిన తీరు.
- సమకాలీన ప్రపంచంలో అల్జీరియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇరాక్, బోస్నియా వగైరా
- భారతదేశం ప్రాచీన చరిత్రలో.

**బౌద్ధమతానికి – హిందూ మతానికి మధ్య**

**జైన మతానికి – హిందూ మతానికి మధ్య**

**వైష్ణవ మతానికి – శైవ మతానికి మధ్య**

– సమకాలీన భారతంలో

హిందూ – ముస్లిం కల్లోలాలు

గాంధీ హత్య

ఇందిరాగాంధీ హత్య

బాబ్రీ మసీదు విధ్వంసం సందర్భంగా జరిగిన మత కల్లోలాలు

## 4. మతం - భారతదేశ ప్రత్యేకత

- వైదిక మతంతో పాటు చార్వాక – బౌద్ధ – జైన మతాల జన్మస్థానం
- క్రైస్తవ, ఇస్లాం, జోరాష్ట్రియన్ మతాలకు ఆశ్రయం
- మత మార్పిడులు – ఒక చారిత్రక వాస్తవం.

- హిందూ మత వర్ణ వ్యవస్థ – "నిమ్న" కులాల దోపిడీ, అణచివేత కారణం.
- మత సామరస్యం కూడా మన చరిత్రలో భాగమే.

ఉదా : 1. అక్బర్

2. 1857 తిరుగుబాటు ( ప్రథమ స్వాతంత్ర పోరాటం)
3. జాతీయోద్యమం (గదర్ ఉద్యమం, ఖిలాఫత్, ఐ.ఎన్.ఎ., ఆర్.ఐ.ఎన్. తిరుగుబాటు).

- సమ్మిశ్రిత సంస్కృతి (Composite Culture)
- సూఫీ – భక్తి ఉద్యమం (కబీర్)
- తాజ్‌మహల్ – కుతుబ్‌మీనార్ – చార్మినార్
- సాయిబాబా – అనేక దర్గాలు
- ఉర్దూ భాష – సాహిత్యం

## 5. లౌకికతత్వం (Secularism)

- మన రాజ్యాంగ పీఠికలో పొందుపరచబడింది.
- 1994 సుప్రీం కోర్టు (బొమ్మై కేసు) తీర్పులో లౌకికతత్వం నిర్వచించబడింది.

"లౌకికతత్వం – మన రాజ్యాంగం యొక్క మౌలిక సూత్రం – దీన్ని మార్చే అధికారం ఎవరికీ లేదు. దీన్ని అధిగమించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్టికల్ 356 క్రింద తొలగించవచ్చు."

"రాజ్యాంగం యొక్క లౌకిక తాత్వికతకు భిన్నంగా ఏ పార్టీ అయినా ఎన్నికల పోరాటం చేస్తే అది రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన నేరానికి పాల్పడినట్లే."

"ఏదైనా ఒక రాజకీయ పార్టీ మత ప్రాతిపదిక మీద అధికారానికి వస్తే ఆ మతం అధికారమతం అవుతుంది. మిగతా మతాలన్నీ ద్వితీయ శ్రేణికి వస్తాయి."

"మన రాజ్యాంగం ప్రకారం – ఏ సంస్థ కూడా ఒకేసారి మత సంస్థగానూ, రాజకీయ పార్టీగానూ ఉండజాలవు. ఇందులో ఏదో ఒకటిగా మాత్రమే ఉండాలి."

అంటే మతాన్ని, రాజకీయాన్ని కలగాపులగం చేయకూడదు. రాజ్యం (స్టేట్) వేరు, మతం (చర్చ్) వేరుగా మాత్రమే ఉండాలి. మతం వ్యక్తిగతం – మత స్వేచ్ఛ వేరు – రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించడం వేరు.

నేడు భారతీయ జనతా పార్టీ సరిగ్గా ఆ కలగాపులగమే చేస్తోంది.

పైగా తనది నిజమైన లౌకికతత్వమనీ – సానుకూల (పాజిటివ్ సెక్యులరిజం) లౌకికత అనీ చెప్పుకుంటుంది.

తన ప్రత్యర్థులది కుహనా (సూడో) లౌకికవాదమని పేరు పెడుతున్నది.

లౌకికవాదం – పాశ్చాత్య భావన అని కొట్టిపారేస్తుంది.

పాశ్చాత్య భావన కాదు – "ఆధునిక భావన" అనీ బహుళ మతాలతో వర్ధిల్లుతున్న మన దేశానికి అదొక్కటే మార్గమనీ తెలియజెప్పాలి.

## 6.హిందూ ఛాందసవాదం

ఆర్.ఎస్.ఎస్. యొక్క గురూజీ "గోల్వాల్కర్" తన రచనల్లో – భారతదేశం హిందువులదేననీ – మిగతా మతాల వారు హిందూ ఔన్నత్యాన్ని అంగీకరించి మాత్రమే ఈ దేశంలో వుండాలనీ స్పష్టంగా తమ సిద్ధాంతాన్ని చెప్పాడు. లక్షలాది యూదుల్ని ఊచకోత కోసిన హిట్లర్‌ను ఆదర్శంగా చిత్రీకరించాడు కూడా.

ఈ సంస్థ యొక్క రాజకీయ విభాగమే బి.జె.పి. పైన చెప్పిన క్రూరమైన సిద్ధాంతాన్నే ఈ పార్టీ అందంగా అందిస్తున్నది. తమది "హిందూయిజం" కాదనీ, "హిందూత్వ"మనీ – "సాంస్కృతిక జాతీయత" (కల్చరల్ నేషనలిజం) అనీ ప్రచారం చేసుకుంటుంది. విషపు గుళికకు మాటల తేనె పూయడం మాత్రమే ఇది.

గంగాజల రథయాత్రలూ, రామశిలా యాత్రలూ, ఏక్తా యాత్రలూ, అస్థికల యాత్రలూ – హిందూ మత దురహంకారాన్ని పరమత విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలే.

విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, దుర్గా వాహినీ, వగైరా సంస్థలన్నీ దాని ఉపాంగాలే.

మహారాష్ట్రలోని 'శివసేన' పార్టీ ఈ కోవకు చెందినదే.

ఈ మతతత్వాన్ని రెచ్చగొట్టే ధోరణి బి.జె.పి.కి తాత్కాలిక లాభాల్ని చేకూర్చి పెట్టింది. 1984లో పార్లమెంట్‌లో 2 సీట్లున్న ఆ పార్టీకి 1991కి 120 సీట్లు, 1998కి 180 సీట్లు వచ్చాయి. 18 చిన్న చితక పార్టీలతో కేంద్రంలో అధికారం కూడా చేజిక్కించుకున్నది.

గత సంవత్సరం పరిపాలనలో తన హిందూత్వ అజెండాను కాషాయ కూటమి ఉపాంగాల ద్వారా అమలు చేస్తోంది. అనేక రాష్ట్రాలలో క్రైస్తవుల మీద పథకం ప్రకారం రాక్షస దాడులు చేస్తోంది. దీనికి క్రైస్తవులు మత మార్పిడులు చేస్తున్నారన్న సాకు చెబుతుంది.

## 7. మైనారిటీ - మత ఛాందసం

హిందూ ఛాందసవాద ప్రచారం పెరుగుతున్న కొద్దీ – దీనికి ప్రతిగా మైనారిటీ మత ఛాందసత్వమూ పెరగడం గమనార్హం.

ఉదా : కాశ్మీర్ – బొంబాయి ప్రేలుళ్ళు – తమిళనాడు బాంబులు.

## 8. కాంగ్రెస్ మెతకదనం

లౌకికతత్వాన్ని అనుసరించడంలో కాంగ్రెస్ సంస్థ కూడా అనేక సందర్భాలలో మెతకదనం ప్రదర్శించింది.

ఉదా : 1. బాబ్రీ మసీదు విధ్వంసం (6 డిసెంబర్, 1992) కాలంలో కేంద్రంలో అధికారంలో వున్న పి.వి. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు.

2. రాజీవ్‌గాంధీ మసీదు గేట్లు తెరిపించడం.

3. షాబానూ కేసు తీర్పును పూర్వ పక్షం చేస్తూ చట్టం చేయడం.

4. ఇటీవల – సోనియా గాంధీ ప్రకటనలు – తిరుపతి యాత్రలు.

## 9. మత ఛాందసానికి వ్యతిరేకం

స్వతంత్రానికి ముందూ తరువాత కూడా ఖచ్చితంగా మత ఛాందసానికి వ్యతిరేకంగా నిలిచింది కమ్యూనిస్టు పార్టీ. కాశ్మీర్‌లో, పంజాబ్‌లో అనేక త్యాగాలు చేసింది. వందలాది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలు అర్పించారు. మత సామరస్యం కోసం, అన్ని మతాల కష్టజీవుల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీయే.

## 10. ముగింపు

- మార్క్సిజానికి సైద్ధాంతిక పునాది భౌతికవాదం.
- భావవాద సైద్ధాంతికత నుండి ఉద్భవించిన దైవాన్ని మతాన్ని వైజ్ఞానిక వాస్తవాలుగా గుర్తించదు.

  అదే సమయంలో ప్రజలకు దేవుడిపై వున్న నమ్మకాన్ని, మతంపై విశ్వాసాన్ని సానుభూతితో అర్థం చేసుకుంటుంది. ఆ దిశలో వారికున్న స్వేచ్ఛను అంగీకరిస్తుంది.

  కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించడానికి నిరీశ్వరవాద స్వీకారం ఒక నిబంధన కాదు. కనుక ఇతరుల స్వేచ్ఛను ఆ పార్టీ ఎలా అడ్డుకుంటుంది? దీనిపై అమాయకుల అపోహలను తొలగించాలి. శత్రువుల వ్యతిరేక ప్రచారాన్ని ఖండించాలి.
- మతపరమైన మైనారిటీలకు రక్షణ కల్పించడానికి, వారి హక్కులను కాపాడటానికి కమ్యూనిస్టు పార్టీ నికరంగా నిలబడుతుంది.
- మత నిబంధనలకున్న సామాజిక పార్శ్వం గురించి చెప్పుకున్నాం. అందులో కొన్ని సానుకూలమైన అంశాలు. కొన్ని ప్రతికూల అంశాలు ఉన్నాయి. అవి ఆ మతాలు ఆవిర్భవించిన దేశ కాల పరిస్థితులను బట్టి నియమాలుగా రూపొందాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా వాటిని మార్పులు చేసుకోవడం మంచిది. (ఉదా : హిందువులలో వున్న బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహ నిషేధం, బహు భార్యత్వం, స్త్రీలకు ఆస్తిపై వున్న పరిమిత హక్కు, విడాకులపై వున్న పరిమితులు, ఇస్లాంలో స్త్రీలపై వున్న నిషేధాలు, బహు భార్యత్వం, తలాక్ సంప్రదాయం, క్రైస్తవంలో ముఖ్యంగా రోమన్ కాథలిక్స్‌లో గర్భస్రావంపై నిషేధం, విడాకులకు వ్యతిరేకం, స్త్రీలకు దత్తత హక్కు).

  ఆయా మతాల నుండే సంస్కరణ ఉద్యమాలు రావాలి. వారిని మానసికంగా తయారు చేసుకోవాలి. వారి విశ్వాసాలపై – అన్య మతాల నుండి దాడి జరుగుతున్న భావన రాకూడదు.
- అధికారంలో వున్న పార్టీలు – తమకున్న మత భావనలని ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని విద్యా సంస్థలలో ప్రవేశపెట్టడం క్షమించరానిది. ఉదా : సరస్వతీ వందనం.

మత సంబంధమైన విద్య, ఆయా కుటుంబాలు తమ బిడ్డలకు చెప్పుకోవచ్చు. అలాగే ప్రభుత్వ సంస్థలలోనికి, యంత్రాంగంలోనికి, ముఖ్యంగా రక్షణ దళాలలోనికి ప్రవేశపెట్టడం ప్రమాదకరం.

– ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో ఏ మత సంబంధమైన క్రతువులు, లాంఛనాలు చేయకూడదు. అన్య మతస్థుల మనసుల్ని అది గాయపరచవచ్చు.

– ముఖ్యంగా రాజకీయాల నుండి మతాన్ని పూర్తిగా వేరు చేయాలి. ఎన్నికలకు గాని మరే ఇతర కార్యకలాపాలకు గాని ఒక రాజకీయ పార్టీ మతాన్ని, మత సంబంధమైన సింబల్స్‌ని వాడకూడదు. ప్రార్థనా స్థలాలు రాజకీయ కార్యకలాపాలకు ఉపయోగించకూడదు.

– మతం ప్రజలందరినీ ఏకం చేసేది కాదు. ఉదా : పాకిస్తాన్ – బంగ్లాదేశ్ యుద్ధం, ఇరాన్ – ఇరాక్ యుద్ధం, అల్జీరియా అంతర్యుద్ధం, రెండో ప్రపంచయుద్ధం, మత ఉన్మాదం, పరమత ద్వేషం, చరిత్రలో అనేక సందర్భాలలో రక్తపాతానికి మాత్రమే దారితీసింది. అందుకే కమ్యూనిస్టు పార్టీ మత సహనాన్ని కోరుతుంది. మత సామరస్యాన్ని బోధిస్తుంది. అంతకుమించి రాజకీయాలలో, పరిపాలనలో నిజమైన లౌకికతత్వాన్ని ఆశిస్తుంది.

– అన్ని మతాలలో, కులాలలో పేదలున్నారు. అణచివేతకు గురికాబడుతున్నవారు, బాధాసర్పదష్టులున్నారు. మతాలకు అతీతంగా వారందరూ ఏకం కావాలనీ, తమ బాధలకూ, దైన్యానికీ వాస్తవమైన కారణాల్ని తెలుసుకునే చైతన్యం పొందడానికి మతం అడ్డు రాకూడదు. వాటి నుండి విముక్తి పొందడానికి చేయవలసిన ఐక్య పోరాటానికి మతం అడ్డు కాకూడదని కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది.